తూర్పుమెట్ట గ్రామాన్ని చుట్టుముట్టిన వరద



ఉగ్ర గోదావరి

గోదావరి వరద విలీన మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరులను ముంచుతూ వస్తోంది. ఇటీవల పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడి వరద పోటెత్తి గ్రామాలకు గ్రామాల్నే అల్లకల్లోలం చేయగా ఈ ఉద్ధాంతం మరిచిపోకముందే మరో వైపు గోదావరి వరద రెండు మండలాల్లో జన జీవనాన్ని స్తంభింపచేస్తోంది.

వరద బారిన వేలేరుపాడు, కుక్కునూరు

- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి
- కొనసాగుతున్న 2వ ప్రమాద హెచ్చరిక
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- పునరావాస కేంద్రాలకు బాధితులు
- గుట్టలపైకి లచ్చింపేట, రుద్రమ్మకోట గ్రామస్థులు
- సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం

వేలేరుపాడు/కుక్కునూరు, జూలై 22 : భద్రాచలం వద్ద గోదావరి పెరుగుతోంది. రెండో ప్రమాద హెచ్చరిక 48 అడుగులు దాటి సోమవారం రాత్రి 10 గంటలకు 50.10 నీటి మట్టానికి చేరుకుంది. 53 అడుగులు దాటితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమై సహాయక చర్యలు ప్రారంభించారు. కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఇతర ఉన్నతాధికారులందరూ వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తున్నా రు. గోదావరి వరద అంతకంతకు పెరుగుతూ వేలేరుపాడు మండలం రుద్రమ్మకోట, రేపాక గొమ్ము, తాటుకూరుగొమ్ము, తిరుమలాపురం, నాళ్ళవరం, చిగురుమామిడి, తదితర గ్రామా లను చుట్టుముట్టి రహదారులను ముంచివేయడంతో రాకపోక లు పూర్తిగా బంద్ అయ్యాయి. ఆయా గ్రామాల్లో మిగిలి ఉన్న గ్రామస్థులను ప్రభుత్వం ఏర్పాటుచేసిన నాటు పడవల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. వరద 53 అడుగులకు చేరితే దీని ప్రభావం మరో 20 గ్రామాలపై పడనుంది. ఉపనదులైన తాలిపేరు, శబరి నదులకు భారీ ఎత్తున వరద నీరు చేరుకోవడంతో ప్రస్తుతం గోదావరికి 11 లక్షల క్యూసె క్కుల నీరు వచ్చి చేరుతోంది. శబరికి వరద ఉధృతికి ఎక్కువ గా ఉండడంతో ఆ ప్రభావం వేలేరుపాడుపై తీవ్రంగా పడు తోంది. శబరి నది గోదావరిలో కలిసే ప్రదేశానికి ఎదురుగా పెద్ద వాగు ఉండడంతో వరద పోటు పెద్ద వాగు ద్వారా వేలేరుపాడులోకి ప్రవేశిస్తోంది. 2022లో ఇదే మాదిరిగా కొద్దికొద్దిగా పెరుగుతూ ఒక్కసారిగా మండలంపై విరుచుకుపడటం తో భారీ ఆస్తినష్టం, పశునష్టం జరిగి ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది అప్పటి మాదిరిగానే వరద పెరుగుతూ వస్తుండడంతో మండల ప్రజలు తిరిగి ఆ రోజులను గుర్తు చేసుకుంటూ మరలా ఏ ఉపద్రవం వచ్చిపడు తుందోనని ఆందోళన చెందుతున్నారు.

కుక్కునూరు మండలంలో అధికార యంత్రాంగం అప్రమత్తమై సహాయక, పునరావాస చర్యలు చేపట్టారు. లచ్చిగూడెం నుంచి 140 కుటుంబాలు, గొమ్ముగూడెం నుంచి 250 కుటుంబాలు, కౌండిన్యముక్తి నుంచి 38 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. లచ్చిగూడెం గ్రామస్థులకు టార్పాలిన్లు, కూరగాయలు అందించారు. గొమ్ముగూడెం, కౌండిన్య ముక్తి గ్రామస్థులకు పునరావాస కేంద్రాల్లో భోజన సదుపాయం కల్పించారు. లచ్చిగూడెం, దాచారం, తెల్లరాయిగూడెం పునరావాస కేంద్రాల్లో ట్రాన్స్‌కో సిబ్బంది బాధితులకు ఇబ్బంది కలగకుండా జనరేటర్ సౌకర్యం ఏర్పాటు చేశారు. అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. గొమ్ముగూడెం నుంచి దాదాపు 30 డాక్టర్లను టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు ఏర్పాటు చేయగా బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు.

నీటమునిగిన సీతారామనగరం రోడ్డు

కుక్కునూరు మండలంలోని శివారు గ్రామం సీతారామనగరానికి వెళ్లే రోడ్డు గోదావరి వరదతో నీట మునిగింది. భద్రాచలం వద్ద 45 అడుగులు చేరగానే ఈ రహదారి నీటమునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు 150 కుటుంబాలు ఆ గ్రామంలో ఉన్నాయి. ఇదిలా ఉండగా 41.15 కాంటూరు లెవెల్‌లో ఆ గ్రామం లేకపోవడం విశేషం. ఇప్పటికైనా మా గ్రామాన్ని ముంపు జాబితాలో చేర్చి పరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రుద్రమ్మకోట గుట్టపై గుడిసెలు వేసుకుంటున్న గ్రామస్థులు

గుట్టలపై గుడిసెలు..

గోదావరిదికి అంతకంతకు వరద తీవ్రత అధికం కావడంతో వేలేరుపాడు మండలం రుద్రమ్మకోట గ్రామస్థులు సమీపంలోని గుట్ట పై తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇటీవల పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడడంతో భారీ వరదల కారణంగా రహదారులు కొట్టుకుపోవడంతో ఈ గ్రామ ప్రజలు బయట ప్రాంతాలకు వెళ్ళడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో రుద్రమ్మకోట గుట్టపై తాత్కాలికంగా నివాసం ఉండేందుకు గుడిసెలు వేసుకుంటున్నారు. గోదావరికి వరదలు వచ్చిన ప్రతిసారి ఈ గ్రామస్థులకు ఈ గుట్టే ఆశ్రయం కల్పిస్తోంది. కుక్కునూరు మండలంలోని లచ్చిగూడెం గ్రామానికి చెందిన 140 కుటుంబాలు వరద కారణంగా సమీప గుట్టలపై తాత్కాలిక గుడిసెలు వేసుకుని అక్కడకు చేరారు.



కౌడిన్యముక్తిలో వరద బాధితులకు భోజనం



గొమ్ముగూడెం నిర్వాసితులను పునరావాస కేంద్రానికి తరలిస్తున్న దృశ్యం

ఎన్నాళ్లీ బాధలు..?

- ఏటా గోదావరి ముంపు.. ఇళ్లు ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు..
- మాకు పరిహారం ఇచ్చి పంపించేయండి..
- కుక్కునూరు 'ఏ' బ్లాక్ నిర్వాసితుల వేదన

కుక్కునూరు, జూలై 22 : 'గోదావరి ముంచుకొస్తుంటే... ఇళ్లు ఖాళీ చేసి పునరావాస కాలనీలకు వెళ్లడం.. వరద తగ్గాక మళ్లీ ఇళ్లకు రావడం.. ఏటా ఇదే బాధలు. మాకు పునరావాస పరిహారం ఇచ్చి పంపించేయండి' అంటూ కుక్కునూరు 'ఏ' బ్లాక్ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 కాంటూరు లెవెల్‌లో కుక్కునూరు మండలంలో ఎనిమిది గ్రామాలున్నాయి. అందులో కుక్కునూరు 'ఏ'బ్లాక్‌లో 750 నిర్వాసిత కుటుంబాలున్నాయి. 2022లో వచ్చిన గోదావరి వరదలకు పూర్తిగా ముంపునకు గురై సర్వం కోల్పోయారు. కనీసం ఉండడానికి ఇళ్లు కూడా లేని పరిస్థితి. ఇంట్లో సామాన్లు వరదలకు కొట్టుకుపోయి కట్టుబట్టలతో మిగిలారు. నిర్వా సిత కుటుంబాల్లో 100కు పైగా కుటుంబాలు తెల్లరాయిగూడెం పునరావాస కాలనీలో మూడేళ్ళగా అక్కడే ఉంటున్నారు. మిగిలిన కుటుంబాలు కూలిన ఇళ్లను బాగు చేసుకుని ఉంటున్నారు. 41.15 కాంటూరు లెవెల్‌లో ఉన్న గ్రామాలకు పూర్తిస్థాయిలో వ్యక్తిగత, పునరావాస పరిహారం ఇచ్చి పునరావాస కేంద్రాలకు తరలిస్తామని అధికారులు పదేపదే చెబుతున్నా అమలు కావడం లేదు. ఏటా జూలై వస్తే చాలు నిర్వాసిత కుటుంబాలు వణికిపోతున్నారు. భద్రాచలంలో ఇప్పటికే 48 అడుగుల నీటిమట్టం చేరుకోవడంతో ప్రస్తుతం కుక్కునూరు 'ఏ'బ్లాక్ నిర్వాసితులు ఇళ్లు ఖాళీ చేయాల్సిన పరిస్థితి. అధికారులు ముందస్తుగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయితే ఎన్నాళ్లీ ఈ బాధలంటూ అధికారులు, ప్రజా ప్రతినిధుల ఎదుట బాధితులు తమ గోడు వినిపిస్తున్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైనా తమ బాధలు అర్థం చేసుకుని పరిహారం ఇచ్చి ఇక్కడ నుంచి తరలించాలని కోరుతున్నారు.



కుక్కునూరు గుండేవాగు తీరంలో పోటెత్తిన గోదావరి



సర్వస్వం కోల్పోయాం

పడాల భాస్కర్, 'ఏ' బ్లాక్ నిర్వాసితుడు

గతంలో వచ్చిన వరదలకు ఇంట్లోనే సామాన్లు ఉంచి పునరావాస కాలనీలకు తరలివెళ్లాం. గోదావరి ఉధృతికి ఇంట్లో సామాన్లంతా కొట్టుకుపోయాయి. ఏటా ఇదే తంతు. ప్రభుత్వం పరిహారమిస్తేనే మాకు న్యాయం జరుగుతుంది.



ఇక్కడ ఉండలేం

మజ్జి అన్నపూర్ణ, 'ఏ' బ్లాక్ నిర్వాసితురాలు

అధికారులు చూపించిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్తున్నాం. దోమలతో ఉండలేక అనారోగ్యంతో బాధపడుతూ ఏటా నాలుగు నెలలు ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు ఉంటున్న ఇల్లు ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం ఎదురు చూస్తూ కాలం గడుపుతున్నాం.



అర్థం చేసుకోండి


ఊటుకూరి వెంకటేశ్వరరావు, 'ఏ' బ్లాక్ నిర్వాసితుడు.

ఏటా ఇళ్ళు వదిలి పునరావాస కాలనీలకు వెళ్ళే బాధలు పడలేకపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం మా బాధలు అర్థం చేసుకోవాలి. ప్రభుత్వం స్పందించి మాకు ఇవ్వాల్సిన పరిహారం అందజేస్తే మేము సంతోషంగా ఖాళీ చేసి వెళ్లిపోతాం.

అప్రమత్తంగా ఉండండి : మంత్రి కొలుసు

ఏలూరు సిటీ : గోదావరి ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా వరద ఉధృతి పెరుగుతున్నందున కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో సహాయ పునరావాస కార్యక్రమాల అమల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన గోదావరి వరద పరిస్థితిపై ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడంలో పూర్తి పర్యవేక్షణ చేయాలన్నారు. వరద పునరావాస కేంద్రానికి వచ్చే వారందరికీ మౌలిక సదుపాయాలు పక్కాగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు 12 పునరావాస కేంద్రాల్లో కుక్కునూరు మండలంలో 2వేలు మందికి, వేలేరుపాడు మండలంలో 4వేల మందికి పునరావాసం కల్పించామన్నారు. నిత్యావసర వస్తువులతో పాటు 15 వేల టన్నుల కూరగాయలను మార్కెటింగ్ శాఖ ద్వారా అందుబాటులో ఉంచామన్నారు.

పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ వద్ద కోతకు గురైన గట్టు



పోలవరంలో వరద జలాలు

పోలవరం, జూలై 22 : పోలవరం ప్రాజెక్టులోకి భారీగా వరద జలాలు చేరుకుంటున్నాయి. సోమవారం సాయంత్రానికి పోలవరం ప్రాజెక్టులోకి 10,95,616 క్యూసెక్కుల వరద జలాలు చేరుకున్నాయి. జలవనరుల శాఖ అధికారులు స్పిల్‌వే 48 గేట్లను పూర్తిగా ఎత్తి వరద జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. స్పిల్వే ఎగువన 33.100 మీటర్లు, దిగువన 24.710 మీటర్లు ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 33.030 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాం కి దిగువన 24.650 మీటర్ల నీటిమట్టం నమోదైంది. మంగళవారం నాటికి మరో 13 లక్షల క్యూసెక్కుల వరద జలాలు వచ్చే అవకాశాలున్నాయని ధవళేశ్వరం గోదావరి హెడ్ వర్క్స్ రమేశ్ తెలిపారు. మరోవైపు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గుంజ వరం, పేద్రాల కాలువ లు, కొండవాగుల జలాలు పొంగి గుంజ వరం కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్నాయి.



ప్రాజెక్టు ప్రధాన మార్గంలో కోతకు గురైన రోడ్డు మార్గం

ఎల్ఎన్‌డీ పేట రిజ ర్వాయర్‌లోకి కొండవాగు ల జలాలు వచ్చి చేరడంతో 221 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేశారు. కొవ్వా డ వరద జలాలు పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. గోదావరి నీటిమట్టం కడెమ్మ స్లూయిజ్ గేట్లను పూర్తిగా ముంచెత్త డంతో కొండ వాగుల జలాలు గోదావరిలోకి వెళ్లే వీలులేక 600 ఎకరాల్లో వరినాట్లు నీటమునిగాయి. గోదావరి వరద జలాలు పోల వరం ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన మార్గమైన కడెమ్మ వంతెనను తాకుతూ ప్రవహిస్తున్నాయి. కొవ్వాడ కాల్వ వరద జలాలు పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. వరద జలాల తాకిడికి పట్టిసీమ ఫెర్రీ రేవు భారీగా కోతకు గురవుతోంది.



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

347.91 అడుగులకు తమ్మిలేరు

చింతలపూడి : తమ్మిలేరు రిజర్వాయర్‌కు ఎగువ నుంచి, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వరద నీరు రావడంతో రిజర్వాయర్‌కు నీటిమట్టం 347.91 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 1,481 క్యూసెక్కులు. రిజర్వాయర్ కెపాసిటీ మూడు టీఎంసీలు, ప్రస్తుతం 1.798 నీరు నిల్వ ఉంది. 355 అడుగులు చేరితే వరద నీటిని దిగువకు విడుదల చేస్తారు. సోమవారం ప్రాజెక్టు పరిస్థితిని చింతలపూడి తహసీల్దార్ గోపాలకృష్ణ పరిశీలించి అధికారులతో సమీక్షించారు. రిజర్వాయర్‌కు ఇంకా ఏడడుగులు వచ్చే వరకు సమస్య లేదని, ప్రస్తుతం వరద నిలకడగా ఉందన్నారు. ఇరిగేషన్ ఏఈ పరమానందం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రకాల్వకు తగ్గిన వరద ఉధృతి

జంగారెడ్డిగూడెం : కొంగువారిగూడెం శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్రకాల్వ జలాశయంలోకి సోమవారం వరద నీటి ఉధృతి తగ్గింది. గంటకు 1,200 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరగా రెండు గేట్ల ద్వారా 1,600 క్యూసెక్కులు దిగువకు విడుదల చేసినట్లు డీఈ రాంబాబు తెలిపారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 80.50 మీటర్లు ఉందన్నారు.

గంజాయ్..

- నూజిడులో జోరుగా గంజాయి విక్రయాలు
- మత్తులో దారి తప్పుతున్న యువత
- దొంగతనాలకు తెగబడుతున్న వైనం
- ఫిర్యాదులు పట్టించుకోని పోలీసులు

7



1912

- విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వండి
- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్‌రాజు

ఏలూరుసిటీ, జూలై 22 : విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రమాదాలను నివారిద్దామని, వర్షాలు, వరదల నేపథ్యంలో విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని విద్యుత్ వినియోగ దారులకు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు తెలిపారు. భారీ వర్షాలు, గాలులు ఉన్నప్పుడు విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుఫాన్ సమయంలో గృహోపకరణాల స్విచ్‌లను ఆఫ్ మోడ్‌లో ఉంచాలని, ఇంటి లోపల కరెంట్ స్విచ్ బోర్డులో స్విచ్‌లను తడి చేతులతో ఆన్, ఆఫ్ చేయరాదన్నారు. చిన్న పిల్లలను కరెంటు వస్తువులను తాకనీయరాదని, ఇంటి సర్వీసు వైరు తెగినా, జాయింట్ కట్ అయినా వాటిని ఎట్టి పరిస్థితుల్లో తాకకూడదన్నారు. ఏ ప్రదేశంలోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు (కండక్టర్) తెగి పడి ఉంటే దానిని విద్యుత్ ప్రసారం ఉన్నదిగా పరిగణించి , సరియైన రక్షణ కల్పించే వరకు వాటిని తాకకుండా వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు తెలపాలన్నారు. మోటార్ స్టార్టర్లు, మోటార్లు వర్షం వల్ల నీటిలో మునగటం , పూర్తిగా తడవటం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉంది కాబట్టి రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు.



వరాలా.. వడ్డింపులా..?

ఈసారైనా కేంద్రం దయ తలుస్తుందా? ఆర్థికంగా చితికిపోయిన అనేక రంగాలకు ఊపిరి పోస్తుందా? మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈసారి కేంద్రంలో మోదీ ప్రభుత్వం వరాల జల్లు కురిపిస్తుందా? లేదా? నేడు కేంద్ర బడ్జెట్ పార్లమెంట్‌లో ప్రవేశ పెడుతుండగా జనం ఆశ, ఆకాంక్షలెన్నో.

- పోలవరానికి భారీ కేటాయింపులు జరిగేనా?
- భద్రాచలం రైల్వేలైన్‌కు మోక్షం కలిగేనా?
- ఆదాయ పన్ను మినహాయింపు పెంపుపై కోటి ఆశలు..వేతన జీవుల్లో ఇదే టెన్షన్
- పక్కా గృహాలు, విద్య, జలజీవన్ మిషన్‌కు భారీ కేటాయింపుల పైనే ఆశలు..

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

ఒకప్పుడు కేంద్రం బడ్జెట్ ప్రవేశ పెడుతుందంటే చాలు తమ ప్రాంతానికి ఏదైనా అదనపు మేలు జరగబోతుందా.. అన్న ఆశ అన్ని వర్గాల కళ్ళల్లోనూ కన్పించేది. ప్రత్యేకంగా ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే మార్గాలు, వ్యవసాయ రంగంలో సబ్సిడీలు, విద్యాభివృద్ధికి సర్వశిక్ష అభియాన్ నుంచి నిధుల వెల్లువ. పేదలకు సొంతి ఇంటికల నెరవేరేలా ప్రధాన మంత్రి యోజన కింద ప్రత్యేకించి ప్రత్యేక కోటా కింద ఇళ్ల మంజూరుపై అందరిలో ఆతృత ఉండేది. కాని మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కేంద్రంలో ఉన్న ప్రభుత్వం రాష్ట్రాలకు ఇచ్చేవాటాలో హెచ్చుతగ్గులు చూపిస్తూ వచ్చింది. గడిచిన ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వీలుగా పెద్దఎత్తున నిధులు కేటాయిస్తే ఆ మేరకు ప్రాజెక్టు పూర్తవుతుందని అందరూ ఆశించారు. కాని గత ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం పోలవరంను తనంతట తానే తొక్కేసింది. కేంద్రం నుంచి కనీసం అదనపు నిధులు కోసం ఒత్తిడి పెంచనే లేదు. రాష్ట్రానికి కావాల్సిన నిధులు వ్యవహారంపై ఎంపీలు నోరు ఎత్తితే ఒట్టు. ఒకవైపు నిధుల కొరత, మరోవైపు జగన్ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేకపోవడంతో రాష్ట్రానికి రావాల్సిన కొన్ని ప్రత్యేక ప్రాజెక్టుల విషయంలో అప్పట్లో మోదీ సర్కార్ పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నట్లుగా వ్యవహరించింది. ఇదే రాష్ట్రానికి చెందిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఉన్నా రాష్ట్రానికి ఒరిగిన అదనపు ప్రయోజనాలేమీ లేవు.

పోలవరానికి ఈసారైనా మోక్షం ఉందా?

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.55 వేల కోట్లకు చేరింది. ప్రాజెక్టు త్వరితగతిన నిర్మాణం పూర్తిచేయడానికి సానుకూలంగా నిధులు కేటాయించాల్సింది కేంద్రమే. కాని 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో ప్రాజెక్టుకు అవసరమైన మొత్తం వ్యయంలో ఎప్పటికప్పుడు రాష్ట్రప్రభు త్వమే తనంతట తానుగా భరిస్తూ ఆ తర్వాత కేంద్రం నుంచి రాబడుతూ ప్రాజెక్టులో 74 శాతం నిర్మాణాన్ని పూర్తి చేయగలిగింది. అంతలా దూసుకుపోయిన ప్రాజెక్టుకు 2019-24 మధ్య జగన్ ప్రభుత్వంలో గ్రహణం పట్టింది. ఇప్పుడు జగన్ ఓటమి అనంతరం కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ప్రాజెక్టుపై మళ్ళీ ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో ఎంచుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రాజెక్టును సందర్శించారు. ఇంకోవైపు ఎంపీలు, కేంద్రమంత్రులు ఎప్పటికప్పుడు కేంద్రంతోనూ, ఇంకోవైపు మంత్రులతోనూ సంప్రదిస్తూ నిధులు రాబట్టాలని ఈ మధ్యనే సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ క్రమంలోనే నేడు ప్రవేశపెట్టే కేంద్రబడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు ఏ మేరకు నిధులు కేటాయింపు ఉంటుందనే దానిపైన ఇప్పుడు సర్వత్రా ఆశ పెరిగింది. ఈ క్రమంలోనే ప్రాజెక్టు నిర్మాణానికి అనువుగా కేటాయింపులు కొంత సంతృప్తికరంగానే ఉంటాయన్న ఆశతో రైతులు ఉన్నారు. ప్రధానిమోదీ ఇప్పటికే ఏపీలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లతో అత్యంత సానుకూలంగా వ్యవ హరిస్తున్నందున పోలవరంతో పాటు మిగతా అంశాలకు నిధులు కేటాయింపు సంతృప్తిగానే ఉంటుందన్న ఆశతో కూటమి నేతలు ఉన్నారు.

మిగతా రంగాల సంగతేంటి?

కేంద్రబడ్జెట్‌లో నిధులు కేటాయింపు అనేక రంగాలకు ప్రతిసారి ఎంతలో కొంత ఊతమిస్తూనే వచ్చింది. ఉదాహరణకు సర్వశిక్ష అభియాన్ కింద టీచర్ పోస్టులు కేటాయింపు, పాఠశాల నిర్వహణకు సంబంధించి పురోగతి పైన కేంద్రం కేటాయించే బడ్జెట్ కాస్త ఊపిరిపోసే విధంగానే ఉండేది. ఇప్పటికే ప్రభుత్వ ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ పూర్తిగా తగ్గిపోవడం, ఖాళీ పోస్టుల సంఖ్య, భర్తీ నోటిఫికేషన్‌లో ఇస్తున్న పోస్టుల సంఖ్యకు మధ్య పొంతనే ఉండడం లేదు. ఈ మధ్యకాలంలో జగన్ సర్కార్ అనేక పాఠశాలలను విలీనం చేసింది. ఎయిడెడ్ పాఠ శాలలను ప్రభుత్వ పాఠశాలలో విలీనం చేసింది. ఈ నేపథ్యం లో కొంత ఉపాధ్యాయుల సంఖ్య పెరిగినా కొరత వెంటాడుతూనే వచ్చింది. కేంద్రం చొరవతో సర్వశిక్ష అభియాన్ కింద ఈసారి ఏవైనా అదనపు భారాలు ఉంటాయా? మధ్యాహ్నం భోజనం పథకం విషయంలోనూ కొన్ని ప్రోత్సాహకాలు ఉంటాయా? విద్యారంగంలోనూ సాంకేతిక విద్యలోనూ సానుకూల దృక్పథంతో వరాలు ఇవ్వబోతున్నారా? అనే ఆశ లేకపోలేదు. ఏటా ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద భారీగా పక్కాగృహాలు మంజూరు చేస్తూ వస్తున్నారు. గతేడాది ఏపీకి కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించిన ప్రధానమంత్రి ఆవాసయోజన కింద మూడు వేల పక్కా ఇళ్లకు పైగానే కోటాగా సమకూరింది. ఈసారి దీనికి రెట్టించిన సంఖ్యలో మంజూరవుతాయన్న ఆశ లేకపోలేదు. కేంద్రసాయంతో ఇంటింటికి కుళాయి పథకం అమలు చేయాలనే లక్ష్యం ఎలాగో ఉంది. భారీగానే నిధులు కేటాయించే విషయంలో ఇప్పటికే సీఎం చంద్రబాబు కేంద్రంతో చర్చించారు. ఇది సఫలమై జలజీవన్‌మిషన్ కింద భారీగా నిధులు కేటాయిస్తే ఇక పల్లెలు అన్నింటికి సురక్షిత మంచి నీరు అందుతుందని అంచనా వేస్తున్నారు. ఆదాయపు పన్ను రెండున్నర లక్షలకు పైగా ఉండేలా నిర్ణయాలు తీసుకోవాలని వేతన జీవులు కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ బడ్జె ట్‌లోనైనా ఆదాయపు పన్ను మినహాయింపు పెంపుపైనే ఉద్యోగ, వ్యాపార వర్గాల్లో ఆసక్తికర చర్చే జరుగుతోంది. వివిధ రంగాల పై భారీగానే వడ్డింపులు ఉండబోతున్నాయని ఆర్థిక నిపుణుల అంచనా. జీఎస్టీ దగ్గర నుంచి అన్ని రంగాలపైన ఈసారి బడ్జెట్ కొత్త ప్రభావం చూపబోతుందని ఇంకో అంచనా.

ఆ లైన్ సంగతి అంతేనా..

కొవ్వూరు నుంచి భద్రాచలం వరకు రైల్వేలైన్ నిర్మిస్తే ఒకవైపు ఏజెన్సీ ప్రాంతంలో రవాణాను మెరుగుపర్చడం, ఇంకోవైపు హైదరాబాద్‌కు వెళ్లేందుకు సమయం కలిసి రావడమే కాకుండా గూడ్స్‌రైళ్ళు సకాలంలో ఆయా మార్గాలకు చేరడం సాధ్యమవుతుందని 1961లోనే కొవ్వూరు - భద్రాచలం రైల్వేలైన్‌కు అంకురార్పణ చేశారు. కాని అదిగో ఇదిగో అంటూ సర్వేల పేరిటే సుదీర్ఘకాలయాపన జరిగింది. ఈ మధ్యనే తాజాగా కొవ్వూరు - భద్రాచలం రైల్వే నిర్మాణానికి దాదాపు 2,145 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఈ అంచనాలకు తగ్గట్లుగానే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే తొలుత సర్వే పనులు పూర్తి చేయడం, ఆ తదుపరి మిగతా పనులవైపు దృష్టిపెట్టేవారు. కాని ఇది జరగలేదు. ఈ లైన్ నిర్మాణానికి గత బడ్జెట్‌లో కేవలం రూ.20 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారు. ఈసారి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడం, కేంద్రంలోనూ సంకీర్ణ భాగస్వామ్యంలో ఉన్నందున ఈ రైల్వేలైన్‌ను ఈసారి నిధులు కేటాయింపు కొంత పెరుగుతుందనే భావన వ్యక్తమవుతోంది.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు


స్టాక్ గొడౌన్‌లో స్టాక్ పరిశీలిస్తున్న డీఎస్‌ఓ రాజు

వేలేరుపాడు, జూలై 22: వరద బాధితులకు పంపిణీ చేసేందుకు 30 టన్నుల బియ్యం, ఎనిమిది టన్నుల ఉల్లిపాయలు, కూర గాయాలు, 500 టార్పాలిన్లు అందుబాటులో ఉంచామని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్ఎస్ ఎస్‌రాజు తెలిపారు. బాధితుల కోసం సిద్ధం సరుకుల ఎగుమతిని డీఎస్‌ఓ సోమవారం పర్యవేక్షించారు. వరద సహాయక కేంద్రాలకు రాలేని పరిస్థితుల్లో ఉన్న బాధిత కుటుంబాలకు మూడు రోజులకు సరిపడ ఐదు కిలోల బియ్యం, అర కేజీ కందిపప్పు, అర కేజీ నూనె, ఐదు రకాల కూరగాయాలు ఒక్కొక్కటి కేజీ చొప్పున ప్రతి ఇంటికి పంపిణీ చేసేందుకు సిద్ధం చేసి, ఆయా గ్రామాలకు తరలించామని తెలిపారు. డీఎస్‌ఓతో పాటు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ భాష, డీపీఓ తూతిగ శ్రీనివాసవిశ్వనాద్ ఉన్నారు.

వరద విపత్తులో సురక్షిత ప్రసవం


జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించిన గిరిజన మహిళ

కుక్కునూరు, జూలై 22 : భారీ వర్షాలు, వరదల కారణంగా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 28 మంది గర్భిణులను జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలోనూ, పీహెచ్‌సీలో చేర్పించారు. ఈ క్రమంలో కుక్కునూరు మండలం చీపురుగూడెంకి చెందిన సోడెం అనీత, మడకం దేవమ్మ, పుల్లపుగూడెం గ్రామానికి చెందిన బి.అరుణలను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రెండు రోజుల వ్యవధిలో ముగ్గురు పండంటి బిడ్డలకు జన్మనిచ్చారు. వరదను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా వారిని ఆస్పత్రిలో చేర్చడంతో ఎటువంటి ఇబ్బంది లేకుండా వైద్యుల పర్యవేక్షణలో సుఖ ప్రసవాలు పొందారని ఆ కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏరియా ఆస్పత్రిలో ముంపు ప్రాంతాల గర్భిణులు


ముంపు ప్రాంతాల నుంచి తీసుకు వచ్చిన గర్భిణులు

జంగారెడ్డిగూడెం, జూలై 22 : వరద ప్రాంతాలైన వేలేరుపాడు, కుక్కునూరు మండలలాలకు చెందిన 19 మంది గర్భిణులను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు సోమవారం జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. సూపరిండెంటెంట్ డాక్టర్ బేబి కమల ఆధ్వర్యంలో వారికి పరీక్షలు నిర్వహించి, వైద్యం అందించారు. వారిలో కొంత మందికి రక్త శాతం తక్కువగా ఉందని గుర్తించి దాతలను సంప్రదించారు. గర్భిణులకు రక్తం అవసరమని ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు వీఏఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పాలడుగుల సురేష్ స్పందించి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేశారు. దీంతో ఎంతో మంది యువకులు స్పందించి తనను సంప్రదించగా వారిలో 20 మంది వద్ద ఏరియా ఆసుపత్రి సిబ్బంది రక్తాన్ని సేకరించారు. యువకులతోపాటు పట్టణానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ జెట్టి భీమశేఖర్ కూడా రక్తదానం చేయడంతో ఆయనను పలువురు అభినందించారు.

ట్రిపుల్ ఐటీలో తొలి రోజు 436 మందికి ప్రవేశాలు


లిఖితకు తొలి అడ్మిషన్ కార్డు అందజేస్తున్న చంద్రశేఖర్

నూజివీడు టౌన్, జూలై 22: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జనరల్ కౌన్సెలింగ్ ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. తొలిరోజు 515 మందికి కాల్ లెటర్లు పంపగా 436 మంది ప్రవేశాలు పొందారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా రెండు రిజిస్ట్రేషన్ కౌంటర్లు, నాలుగు అకడమిక్ వెరిఫికేషన్, మూడు ఫీజు, డేటా ఎంట్రీకి సంబంధించి ఏడు, సర్టిఫికెట్ కలెక్షన్స్‌కు నాలుగు, ఐడీ కార్డు ఇష్యూ కౌంటర్లుమూడు ఏర్పాటు చేశారు. శాక్ బిల్డింగ్‌లో అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు చేయగా నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్, అడ్మిషన్స్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ తొలి రోజు ప్రవేశాల ప్రక్రియను పర్యవేక్షించారు. పదో తరగతిలో 597 మార్కులు సాధించి ఆర్‌జీయూకేటీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న తిరుపతి జిల్లా కొత్త వేపకుప్పంకు చెందిన పి.లిఖితకు తొలి అడ్మిషన్ ఇస్తూ డైరెక్టర్ చంద్రశేఖర్, అమరేంద్ర కుమార్ ఐడీ కార్డును అందజేశారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ పొడిగింపు

ఏలూరు అర్బన్, జూలై 22 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు, డీపీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఇప్పటికే అమలవుతున్న ఈహెచ్ఎస్ పథకానికి సమాంతరంగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ కొనసాగుతుందన్నారు.

'పది' పరీక్షార్థుల మాధ్యమంపై స్పష్టత ఇవ్వాలి

పదో తరగతి విద్యార్థులందరూ తప్పనిసరిగా ఆంగ్ల మాధ్యమంలోనే పబ్లిక్ పరీక్షలు రాయాలంటూ గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన నిబంధనను కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సడలించాలని అంజనేయులు డిమాండ్ చేశారు. ఆ మేరకు మాధ్యమం ఎంపికను విద్యార్థి అభీష్టానికే వదిలేయాలన్నారు. దీంతోపాటు హైస్కూళ్లలో ఆంగ్లంతోపాటే, తెలుగు కూడా సమాంతరంగా ప్రవేశపెట్టాలని, ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో నుంచి ఐదో తరగతి వరకు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికనుగుణంగా జీవో 117 ఉత్తర్వులను రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో లోపాలను సరిదిద్దడంతోపాటు, టోఫెల్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

పీఎఫ్ చెల్లింపు.. సమ్మె విరమణ

ఏలూరు క్రైం, జూలై 22 : జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులలో పనిచేసే పారిశుద్య కార్మికులకు థర్డ్ పార్టీ కాంట్రాక్టర్ పీఎఫ్ చెల్లించడంతో ఈ నెల 22న తలపెట్టిన సమ్మెను విరమించారు. కాంట్రాక్టర్ వెంటనే ఆ సొమ్ము చెల్లించడంతో సమ్మె విరమించినట్లు జిల్లా అధ్యక్షుడు పి కృష్ణమాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

పునరావాస కేంద్రాలకు


నాటు పడవ పై తిరుమలాపురం వెళ్తున్న కలెక్టర్, ఎస్పీ

కుక్కునూరు, వేలేరుపాడు వరద బాధితుల తరలింపు

- వరద ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ సుడిగాలి పర్యటన
- చాగరపల్లి గ్రామానికి నాటుపడవ పై వెళ్లి పరామర్శ
- నిత్యావసర సరుకులు అందజేత

వేలేరుపాడు/కుక్కునూరు, జూలై 22: గోదావరి వరద చుట్టుముట్టిన వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ సుడిగాలి పర్యటన చేశారు. వరద చుట్టుముట్టిన రేపాకగొమ్ము, తిరుమలాపురం, చాగరపల్లి గ్రామాలకు వెళ్లి వరద క్రమేపీ పెరుగుతున్నందున తక్షణమే గ్రామాలను ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. అప్పటికప్పుడు సహాయ చర్యలు చేపట్టాలంటే కష్టమవుతుందని దీని వలన ప్రజలకు, అధికారులకు కూడా ఇబ్బందిగా ఉంటుందని, గ్రామాలు ఖాళీ చేయాలని కలెక్టర్ కోరారు. వరద ఉధృతి తగ్గేంత వరకు పునరావాస కేంద్రాల్లో ఉండాలని, ప్రజలకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. కలెక్టర్ విజ్ఞప్తికి చాగరపల్లి గ్రామస్థులు స్పందించారు. ఈ గ్రామంలోని ప్రజలను దాచారంలోని ఆర్ అండ్‌ఆర్ కాలనీకి తరలించే ఏర్పాట్లు అధికారులు ప్రారంభించారు. కన్నాయగుట్ట అంగన్వాడీ కేంద్రంలో నిత్యావసర వస్తువుల స్టాక్ పాయింట్‌ను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. వరద కారణంగా రహదారి సౌకర్యంలేని గ్రామాలకు మూడు రోజులకు సరిపడ ఐదు కిలోల బియ్యం, అరకేజీ కంది పప్పు, అరకేజీ వంట నూనె, ఐదు రకాల కూరగాయలు కేజీ చొప్పున, నిత్యావసర సరుకులను ప్రతీ ఇంటికి వాటర్ ప్యాకెట్ల బస్తాను అందజేస్తున్నామని తెలిపారు. కలెక్టర్, ఎస్పీ ఆదివారం సాయంత్రం నుంచి వేలేరుపాడులో మకాంచేసి వరద పరిస్థితి పై ఆరాతీస్తూ తీసుకోవాల్సిన సహాయక చర్యలపై అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. వరద చుట్టుముట్టిన గ్రామాలకు వైద్య సిబ్బందిని పడవల ద్వారా పంపించారు. గ్రామాల్లోని ప్రజలను తరలించే బాధ్యతలను స్థానిక అధికారులకు, బయట ప్రాంతాల నుంచి రప్పించిన గ్రామ కార్యదర్శులకు అప్పగించారు. సోమవారం ఉదయం నుంచి కలెక్టర్, ఎస్పీలు వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. దీంతో జిల్లా అధికార యంత్రాంగం మొత్తం ఇక్కడే దృష్టి కేంద్రీకరించింది.

30 బోట్లు, హెలికాప్టర్ సిద్ధం : కలెక్టర్

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఐదు కేంద్ర, రాష్ట్ర విపత్తు నివారణ బృం దాలు, 30 బోట్లు, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించటానికి హెలికాప్టర్లు రాజమండ్రిలో సిద్ధంగా ఉంచామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలలో కలెక్టర్ సోమవారం పర్యటించి దాచారం పునరావాస కాలనీని సందర్శిం చారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో వరద పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కునేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. ముంపునకు గురైన గ్రామాలలో రహదారి సౌకర్యం దెబ్బతిన్న కారణంగా బోటులో వెళ్లి అక్కడ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని తెలిపారు. వరద సహాయక కేంద్రాల్లో వరద బాధితులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. ప్రతి గ్రామానికి ప్రత్యేకాధికారులను నియమించామని, బాధితులు పూర్తి స్థాయిలో సహకరిస్తే ఎటు వంటి సమస్యలు తలెత్తవని అన్నారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్‌శివకిశోర్ మాట్లాడుతూ మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు సమాచార వ్యవస్థకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టామన్నారు.


కుక్కునూరు మండల దాచారం పునరావాస కాలనీలో నిర్వాసితులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఏం పెద్దాయనా.. వసతులు బాగున్నాయా

'ఏం పెద్దాయనా ఎలా ఉన్నారు... వసతులు బాగున్నాయా... మీ గ్రామంలో ఎవరైన పునరావాస కేంద్రానికి రాని వారు ఉంటే వారిని తీసుకురండి'.. అంటూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి దాచారం పునరావాస కాలనీలో గొమ్ముగూడెం గ్రామానికి చెందిన సత్యం (70)తో మాట్లాడిన తీరు అందరిని ఆకట్టుకుంది. వరద బాధితులను ఆదుకునేందుకు కలెక్టర్ వెట్రిసెల్వి నిర్వాసితులతో మాటా మంతి కలుపుతూ వారి ఇబ్బందులను తెలుసుకుంటున్నారు. ఆదివారం గోదావరి పెరుగుతుందన్న సమచారం తెలుసుకున్న కలెక్టర్ వేలేరుపా డు మండలానికి వచ్చి అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. మరలా సోమవారం వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో బాధితులను కలిసి ఇంకా ఏమైనా సహాయం అందించాలా అని అడిగి అధికారులతో చర్చించి పరిష్కరిస్తున్నారు. నిండు గోదావరిలో బోటుపై ప్రయాణిస్తూ రహదారి సౌకర్యం లేని గ్రామాలను సందర్శిస్తున్నారు. బాధితులను ఆదుకునేందుకు కలెక్టర్ తనదైన శైలిలో విధులు నిర్వహించడంపై వరద బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించండి : జేసీ


కుక్కునూరు మండలం దాచారం పునరావాస కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జేసీ లావణ్యవేణి

కుక్కునూరు, జూలై 22 :గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో మెరుగైన వైద్యాన్ని అందుబాటులో ఉంచేందుకు పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి తెలిపారు. దాచారం పునరావాస కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సోమవారం జేసీ సందర్శించారు. వైద్య శిబిరంలో అందజేస్తున్న మందులను ఆమె పరిశీలించారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలందించాలని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలందించాలన్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెదవేగి, జూలై 22: పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్‌వీ)లో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. అభ్యర్థులు 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి, 2024-25 విద్యా సంవత్సరంలో ఉమ్మడి పశ్చిమ గోదావరిలో చదువుతూ ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదో తరగతి చదువుతూ ఉండాలి. అర్హత కలిగిన విద్యార్థులు https://navodaya.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబరు 16 లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 18న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

క్రైం కార్నర్

హుండీ పగులగొట్టి...

ద్వారకాతిరుమల, జూలై 22: శ్రీవారి క్షేత్ర ఆళ్వార్ సదనం సమీపంలో ఉన్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో దొంగలు పడ్డారు. ఆలయంలో ఉన్న హుండీని పగలకొట్టి అందులోని నగదును దొంగిలించారు. ఏటా శరన్నవ రాత్రులకు ముందు రోజుల్లో ఇక్కడి హుండీని తెరచి లెక్కిస్తారు. దాదాపు ఏడు నెలలుగా తెరవని ఈ హుండీలో దాదాపు రూ.40 వేలు పైబడి నగదు ఉండవచ్చని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు ద్వారకా తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

నూజివీడు, జూలై 22: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. రామన్నగూడెంకు చెందిన శీలం వెంకటేశ్వరరావు 2020 ఫిబ్రవరిలో విజయవాడకు చెందిన కరికేటి పాల్ తిమోతికి రూ.ఏడు లక్షలు అప్పుగా ఇవ్వగా, బాకీ తీర్చే నిమిత్తం రూ.7.5 లక్షల కు 2021 మార్చిలో చెక్కులు ఇచ్చాడు. అయితే ఆ చెక్కులు బౌన్స్ కావడంతో బాధితుడు కోర్టును ఆశ్రయించగా నిందితుడు తిమోతికి ఆరు మాసాల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు.

వ్యవసాయ కేబుల్ వైర్లు చోరీ

ద్వారకాతిరుమల, జూలై 22 :వర్షాలు కురుస్తుండటాన్ని అదనుగా చూసు కుని కేటు గాళ్లు వ్యవసాయ కేబుల్ వైర్లను టార్గెట్ చేస్తున్నారు. రైతులు పొలా నికి రారన్న ధైర్యంతో దర్జాగా వైర్లను దొంగింలించి అమ్ముకుంటున్నారు. ఈ క్రమంలో రామన్నగూడెం పంచాయతీ దేవినేనివారిగూడెంలో దాదాపు 15 మంది రైతుల వ్యవసాయ బోర్ల విద్యుత్ వైర్లు చోరీకి గురయ్యాయి. వాటి విలువ సుమారు రూ. లక్షా 50 వేలు ఉంటుందని చెబుతున్నారు. వారంతా సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 40 నుంచి 50 మీటర్ల వైర్లను, 15 మంది రైతులకు చెందిన బోర్లు నుంచి ఈ నెల 20న చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలా తరచూ జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గోదారిలో జారిపడి ఒకరి మృతి


కుంజా వెంకయ్య (ఫైల్)

వేలేరుపాడు, జూలై 22: తూర్పుమెట్టకు చెంది న ఒక వ్యక్తి గోదావరి వరదను చూసేందుకు వెళ్లి జారిపడి మునిగి చనిపోయిన ఘటన సోమ వా రం ఉదయం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివ రాల ప్రకారం కుంజా వెంకయ్య (48) మరికొంత మందితో కలిసి గ్రామానికి అనుకుని ప్రవహి స్తు న్న గోదావరి నదిని చూసేందుకు వెళ్ళాడు. అయి తే ప్రమాదవ శాత్తు బురదలో కాలుజారి పోవడం తో నదిలోపడి మునిగిపోయాడు. ఇది గమనించిన తోటివారు వెంటనే నదిలోకి దిగి గాలించగా అప్పటికే మృతి చెందిన వెంక య్య మృతదేహం లభ్యమైంది. వెంకయ్య మృతి చెందిన విషయాన్ని గ్రామ స్థులు స్థానిక అధికారులకు సమాచారం ఇచ్చారు.

ప్రమాదవశాత్తు గోదావరిలో పడిన వ్యక్తి

యలమంచిలి (పాలకొల్లు రూరల్), జూలై 22: యలమంచిలి లంక శివా రు చాకలిపాలెం గోదావరి నదిలో గ్రామానికి చెందిన పితాని ఆనంద్ కుమార్ అనే వ్యక్తి ప్రమాద వశాత్తు కాలు జారి పడిపోయాడు. అతని ఆచూకీ కోసం గ్రామస్తులు, అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.

యాసిడ్ తాగి మహిళ ఆత్మహత్య

భీమవరం క్రైం, జూలై 22 : బాత్ రూమ్‌కు వాడే యాసిడ్ తాగి ఒక మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. భీమవరం వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర రావు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ అంబేడ్కర్ జిల్లా మామిడికుదురు మండలం జగ్గన్నపేటకు చెందిన జానా ఏసురాజు కొంత కాలం క్రితం ఉద్యోగం నిమిత్తం భీమవరం వచ్చి మెంటేవారి తోటలో నివాసముంటున్నారు. అతని తల్లి జానా అరుణావతి(57)కు మానసిక వ్యాధి ఉండడంతో అప్పడప్పుడు బయటకు వెళ్లి మతి స్థిమితం లేకుండా ఉంటుంది. ఆమెకు ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. సోమవారం ఉదయం అరుణావతి బాత్‌రూమ్ కడిగే యాసిడ్‌ను తాగేసింది. అది చూసిన కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు జానా ఏసురాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జూలై 22 : భార్యాభర్తల గొడవలు నేపథ్యంలో ఒక వ్యక్తి పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరులోని బీడీ కాలనీకి చెందిన పోలరౌతు వెంకట నాగ శ్రీనివాసరావు (45) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య లావణ్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తాగి వచ్చి భార్యను కొడుతున్నారు. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య గొడవలు జరిగాయి. శ్రీనివాసరావు ఈ నెల 21వ తేదీన పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతనిని ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందు తూ సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

పేకాటలో ముగ్గురి అరెస్ట్

ఏలూరు క్రైం, జూలై 22 : ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చాటపర్రులో సోమవారం సాయంత్రం పేకాట ఆడుతున్న ముగ్గురిని ఏలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,600లు స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి



నూజివీడులో జోరుగా గంజాయి విక్రయాలు

- మత్తులో దారి తప్పుతున్న యువత
- దొంగతనాలకు తెగబడుతున్న వైనం
- ఫిర్యాదులు పట్టించుకోని పోలీసులు

నూజివీడు పట్టణంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ యువతకు గంజాయి స్వేచ్ఛగా దొరుకుతుండడంతో ఈ వ్యసనానికి మరింత బానిసలవుతున్నారు. తాజాగా పట్టణంలోని బాపూనగర్‌లో కొందరు యువకులు, ఒక యువకుడిని ఫలానా వ్యక్తి నుంచి గంజాయి తీసుకురమ్మని కోరటం, దానికి ఆ యువకుడు తిరస్కరించడంతో ఆ యువకుడిపై వారు దాడి చేసి బ్లేడుతో గాయపరిచిన సంఘటన ఇటీవల జరిగిన సంగతి తెలిసిందే. పదిహేనేళ్ల నుంచి నూజివీడులో గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం ఎక్కువగానే ఉన్నా, మీడియాలో ఈ విషయం వెల్లడైనప్పుడు పోలీసులు అరికట్టడానికి కనీసం కంటితుడుపు చర్యలు చేపట్టేవారు. గత వైసీపీ పాలనలో పోలీసులు గంజాయిని అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. గంజాయిపై సమాచారమిచ్చినా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

\- నూజివీడు

నూజివీడు పట్టణం నలుమూలల్లోనూ, శివారు ప్రాంతాల్లోని మామిడితోటలు, జనసంచారం లేని ప్రాంతాల్లో ప్రతి రోజూ సాయంత్రం యువత గంజాయి సేవిస్తున్నారు. గతంలో గంజాయి అమ్మకాలను 40, 50 ఏళ్ల పైబడిన వ్యక్తులు చేసేవారు. ఇప్పుడు గంజాయి అమ్మకందారులు, కొనుగోలుదారులు యువకులే కావడం విశేషం. పట్టణంలో బాపూనగర్, నెహ్రూపేట, అమెరికన్ ఆసుపత్రి సెంటర్, ఎమ్మార్ అప్పారావు కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, ఆర్ఆర్ పేట, గాంధీనగర్ ప్రాంతాల్లో గంజాయి వినియోగం ఎక్కువగా ఉందని సమాచారం. ఇప్పటివరకు గంజాయి అమ్మకాల్లో వైసీపీకి చెందిన స్థానిక యువ నాయకులు పాత్ర ఉందనే ప్రచారం సర్వత్రా వినిపిస్తోంది. ముఖ్యంగా మధ్యతరగతి, దిగువ తరగతి యువత ఈ వ్యసనానికి బానిసలై చివరకు గంజాయి కొనుగోలుకు దొంగతనాలకు దిగుతున్నారు. బాపూనగర్‌లో చాలామంది తమ ఇంటి బయట పెట్టిన ద్విచక్రవాహనాల్లో రాత్రివేళ పెట్రోల్ దొంగతనాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇది గంజాయి తాగేందుకు అలవాటు పడినవారి పనే అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


నూజివీడులో పట్టుబడిన గంజాయి, మత్తు ఇంజక్షన్లు (ఫైల్)


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గంజాయి తేనందుకు దాడికి గురైన యువకుడు(ఫైల్)

యువత బానిస

గత ఐదేళ్లుగా నూజివీడులో గంజాయికి అధిక సంఖ్యలో యువత బానిసలయ్యారు. దీనికి ప్రధాన కారణం మార్కెట్లో యథేచ్ఛగా గంజాయి దొరకడమే. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కొంతమంది యువకులు నూజివీడులో మకాం వేసి, ఊరు శివారులో సిగిరెట్ తాగే యువతను టార్గెట్ చేసి వారితో పరిచయం పెంచుకుని వారికి తొలుత కొద్ది మొత్తంలో గంజాయిని ఉచితంగా ఇచ్చి వారిని మత్తుకు అలవాటు చేశారు. ఈ మత్తుకు అలవాటు పడిన యువకుల నుంచి తరువాత డబ్బులు వసూలు చేసేవారు. ఇంజినీరింగ్ విద్యను సైతం అభ్యసిస్తున్న కొంతమంది బానిసలై చివరకు గంజాయి కొనటానికి సొమ్ము లేక వారు గంజాయి అమ్మకాలకు దిగినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వారు రెండుసార్లు పట్టుబడి జైలుకు వెళ్లి తమ విద్యను పాడుచేసుకున్న ఘటనలు నూజివీడులో జరిగాయి.

నిద్ర మత్తులో పోలీసులు

గంజాయి అమ్మకాలపై పోలీసుల వద్ద పూర్తిసమాచారం ఉన్నప్పటికీ పోలీసులు నిద్రమత్తులో జోగుతున్నారనే ప్రచారం ఉంది. మైనర్ల భవిష్యత్తు దృష్ట్యా వారిమీద కేసులు నమోదు చేయకున్నా, వారి ద్వారా అమ్మకం దారులను పట్టుకుని కేసులు నమోదుచేసి అమ్మకాలను అరికట్టవచ్చు. కానీ పోలీసులు ఆ పని చేయడం లేదు. నూజివీడుకు చెందిన యువ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఆ వైద్యుడు స్పందనలో ఫిర్యాదు చేసినా న్యాయం జరగకపోవడంతో ఇటీవల సదరు వైద్యుడు సామాజిక బాధ్యత దృష్ట్యా కోర్టులో ప్రైవేట్ కేసు వేయడంతో కోర్టు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేయమని పోలీసులను ఆదేశించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కేసు నమోదైనా చర్యలు నిల్

కోర్టు జోక్యంతో పోలీసులు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినా ఇంతవరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇది దేనికి సంకేతమో పోలీసులే చెప్పాలని నూజివీడు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వైసీపీ ప్రభుత్వం మారి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇటీవల ఏలూరు జిల్లాకు నూతన ఎస్పీగా కొమ్మి ప్రతాప్ శివకిశోర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ప్రాధాన్యత దృష్ట్యా గంజాయిని అరికట్టడంపై దృష్టి సారించి ఉక్కుపాదం మోపి యువత భవిష్యత్తును కాపాడేలా నూజివీడు పోలీసులు నిద్రమత్తు వదిలేస్తారని ఈ ప్రాంత ప్రజలు ఆశాభావంతో ఉన్నారు.

ఎర్ర కాల్వలో చేపల వేట



వర్షాలతో ఎర్ర కాల్వ పొంగి ప్రవహిస్తోంది. నీటి ప్రవాహంలో చేపల, రొయ్యల వేట కొందరికి ఉపాధి చూపుతోంది. వరద ఉధృతి తగ్గడంతో పంగిడిగూడెం - రాజవరం మార్గంలో పలువురు చేపల వేటకు దిగడంతో పరిసర ప్రాంతాల వారు అక్కడికి చేరుకున్నారు. చేపలు, రొయ్యలు రూ. వంద నుంచి రూ.300 వరకు విక్రయించారు. - జంగారెడ్డిగూడెం



సమస్యలు చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు

'మీకోసం' రద్దు సమాచారం తెలియక..

ఏలూరు రూరల్, జూలై 22:జిల్లాలో వర్షాలు, వరదల కారణంగా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీ కోసం) ఈ వారం రద్దు చేశారు. సమాచారం తెలియని అర్జీదారులు కొందరు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. దూరప్రాంతాల నుంచి వృద్ధులు, తదితరులు ఉదయం 10.30 గంటలకు సమావేశ మందిరానికి వచ్చారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ రద్దు చేసినట్లు తెలపడంతో నిరాశగా వెనుదిరిగారు. సోమవారం జరిగే కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు ఆదివారం సాయంత్రం ప్రకటించ డంతో జిల్లా ప్రజలందరికీ తెలియక ఇబ్బందులు పడ్డారు.

వర్షాలు, వరదల్లో జాగ్రత్తలు పాటించాలి : ఏఎస్పీ



అర్జీలు స్వీకరిస్తున్న ఏఎస్పీ స్వరూపరాణి

ఏలూరు క్రైం, జూలై 22 : భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని. కరెంటు స్తంభాలను ముట్టుకోవద్దని, వేలాడే వైర్లను తాకరాదని ఏఎస్పీ జి.స్వరూపరాణి సూచించారు. ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ ఆదేశాలతో ఏఎస్పీ జి స్వరూపరాణి సోమవారం ప్రజా సమస్య పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల ప్రజల నుంచి వచ్చిన 30 ఫిర్యాదులను స్వీకరించారు. సత్వర పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాల చుట్టుపక్కల ఉన్న కరెంటు స్థంభాలకు కరెంటు సరఫరా కాకుండా రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి : యూటీఎఫ్



డీఈవోకు వినతిపత్రాన్ని ఇస్తున్న నేతలు

ఏలూరు అర్బన్, జూలై 22: గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన విద్యారంగ సంస్కరణల ఫలితంగా విద్యావ్యవస్థ అస్తవ్యస్త మైందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా శాఖ నాయకులు కోరారు. డీఈవో అబ్రహంను కలసి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపల్ టీచర్ల పీఎఫ్ సమస్యను పరిష్కరించాలని, ఒక కిలో మీటరు పైబడి దూరం నుంచి వచ్చే బాలబాలికలకు రవాణా సౌకర్యాన్ని కల్పించాలని సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్ సూచించారు. మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, పదోన్నతులు, బదిలీలను నిర్వహించాలని కోరారు. హైస్కూళ్లలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు రెండింటినీ సమాంతరంగా కొనసాగించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఒకే రకమైన సిలబస్, పరీక్షా విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 117 ఉత్తర్వులను రద్దుచేసి, జీవో 5 ఉత్తర్వుల ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. సంఘ నాయకులు రంగమోహన్, మోహన్‌రావు, కమల్‌కుమార్, శివశంకర్‌రావు, రామకృష్ణ, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ రాజేంద్రప్రసాద్

పెదవేగి, జూలై 22: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ రౌడీ షీటర్లను హెచ్చరించారు. మండలంలోని పలువురు రౌడీషీటర్లకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ రౌడీ షీట్‌తో మార్పు రావాలన్నారు. కొంతమంది దాడులు, దౌర్జన్యాల వంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని, అలాంటివారిని ఉపేక్షించబోమని తెలిపారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ సూచించారు.

పేద గిరిజనులపై దాడి దారుణం



వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

టి.నరసాపురం, జూలై 22: పేద గిరిజనులపై దాడి హేయమని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులతో కలసి సోమవారం ఆందోళన నిర్వహించారు. టి.నరసాపురం పంచాయతీ అల్లూరి సీతారామరాజు నగర్‌లో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను భూస్వాములు ఆక్రమించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. కొందరు రెవెన్యూ అధికారులు రికార్డులను తారుమారు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిటి ఉదయ్‌కు వినతిపత్రం అందజేశారు. మడకం సుధారాణి, అనుములు మురళీ, లక్ష్మి, కుమారి, లక్ష్మడు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులు..
దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు, జూలై 22: ఉంగుటూరు మండలం నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీకే.విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ నెల 23 నుంచి 27 వరకు దరఖాస్తు చేయవచ్చని, తర్వాత చేసుకుని మౌఖిక పరీక్షకు హాజరు కావలసి ఉంటుందన్నారు. రాజనీతిశాస్త్రం, కామర్స్ విభాగంలో ఆసక్తి ఉన్న అభ్యర్థులు అతిధి పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు డి.రెడ్డియ్య సెల్.93987 47492, కొండా రవి సెల్.94911 75498లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.



ఉంగుటూరు మండలం నాచుగుంటలో నీట మునిగిన వరి నాట్లు



టి.నరసాపురం మండలంలో ముంపు పరిశీలిస్తున్న ఏవో, సిబ్బంది



తంగెళ్ళమూడిలో వరి నారు పరిశీలిస్తున్న రైతు సంఘ నాయకులు

వీడని ముంపు

5498.8 హెక్టార్ల పంట నీటిలోనే..

నానుతున్న వరి, మొక్కజొన్న, పత్తి పంటలు

ఏలూరు సిటీ, జూలై 22: భారీ వర్షాలు, వరదల వల్ల జిల్లాలో 5498.8 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, పత్తి పంటలు నీట మునిగాయి. 193.2 హెక్టార్లలో వరి నారుమడులు, 5292 హెక్టార్లలో నాట్లు ముంపులోనే ఉన్నాయి. 190 హెక్టార్లలో పత్తి, 16.8 హెక్టార్లలో మొక్కజొన్న ముంపులో ఉన్నాయి. కొద్ది రోజులు వరి నాట్లు ముంపులో ఉంటే తిరిగి నాట్లు వేయాల్సిందేనని, నారుమడులు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నారుమడులు కుళ్లిపోతే మళ్లీ విత్తనాలు వేయాల్సి వస్తుందని అప్పుడు సాగు ఆలస్యం అవుతుందని చెబుతున్నారు.

ఉంగుటూరు మండలంలో ముంపులో వరి నాట్లు

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు నాలుగు రోజుల నుంచి ముంపులో ఉన్నాయి. కైకరం, చేబ్రోలు, నాచుగుంట, వెల్లమిల్లి, బాదంపూడి ఆయకట్టు నీట మునగడంతో రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. జాతీయ రహదారి వెంబడి సుమారు 350 ఎకరాల వరి నీట మునిగిందని ఏవో బాలిన వెంకటేశ్ తెలిపారు.

మండలంలో నీట మునిగిన వరి నాట్లను ఆర్డీవో ఖాజావలి సోమవారం పరిశీలించారు. నాచుగుంట, వెల్లమిల్లి, బాదంపూడి, వెల్లమిల్లి, కైకరం ఆయకట్టులో చేలను పరిశీలించి వ్యవసాయాధికారులు, ఇరిగేషన్ అధికారులను అప్రమత్తం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ కె.వెంకట శివయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 10.1 మి.మీ. వర్షపాతం

జిల్లాలో సోమవారం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. గడచిన 24 గంటల్లో అత్యధికంగా వేలేరుపాడు మండలంలో 44.6 మి.మీ., జిల్లాలో సరాసరి వర్షపాతం 10.1 మి.మీ. నమోదైంది. కుక్కునూరులో 21, జంగారెడ్డిగూడెం 18.2, పోలవరం 18, బుట్టాయిగూడెం 15.8, కొయ్యలగూడెం 15.6, పెదవేగి 14.2, దెందులూరు 14.2, కామవరపుకోటలో 10.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన తక్కువ వర్షపాతం నమోదైంది.

చేలల్లో నీటిని తొలగించాలి : ఏవో సూచనలు

టి.నరసాపురం: మండలంలో 62 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ఏవో బి.సుమలత తెలిపారు. నీట మునిగిన చేలను ఏవో, సిబ్బంది సోమవారం పరిశీలించారు. 55 ఎకరాల్లో వరి, 7 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు నీట మునిగాయని ఏవో తెలిపారు. నీట మునిగిన 5 సెంట్లు నారుమడికి 1కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చల్లాలని సూచించారు. నాట్లు ముంపులో ఉంటే నీరు బయటకు తోడాలన్నారు. ఎకరానికి 20 కిలోల యూనియా, 10 కిలోల పొటాష్ బూస్టర్ డోస్‌గా వేసుకోవాలన్నారు. నీరు పూర్తిగా తీయలేని పక్షంలో 2శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారి చేస్తే పైరు త్వరగా పుంజుకుంటుందన్నారు. తెగుళ్ళు సోకకుండా కార్బండిజమ్ 1 గ్రాము లేదా మాంకోజెబ్ 2 గ్రాముల మందు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో నరేంద్ర తదితరులు ఉన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ఏలూరు కార్పొరేషన్: భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తంగెళ్ళమూడి, కొమడవోలు నీట మునిగిన వరి చేలను పరిశీలించారు. నేటికీ వర్షపు నీటిలో పంట మునిగి ఉందని, ప్రభుత్వం వెంటనే సర్వే జరిపి పంట నష్టపోయిన రైతులకు పరిహారాలు అందించాలని కోరారు. కౌలు రైతులను కూడా అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట బాధిత రైతులు గొర్రెల సాంబశివరావు, లావేటి శ్రీనివాసరావు, మొగిలి భాస్కరరావు, వినుకొండ నాగేశ్వరరావు, గేదెల రాఘవరాజు తదితరులు ఉన్నారు.



ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో సూర్యతేజ



పోలవరంలో వరద పరిస్థితిపై సమీక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి

బాధితులను సురక్షితంగా తరలించాలి

● ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి ఐటీడీఏ పీవో సూచన

వేలేరుపాడు, జూలై 22: గోదావరి వరద గ్రామాలను చుట్టుముట్టడంతో బాధితులను సురక్షితంగా తరలించాలని ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలకు ఐటీడీఏ పీవో సూర్యతేజ సూచించారు. మండలంలో సోమవారం ఆయన వరద సహాయక చర్యలను పర్యవేక్షించారు. పునరావాస కేంద్రాలకు తరలించగా మిగిలిన వారిని బోట్లపై తరలించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతీ ఒక్కరికి లైఫ్‌జాకెట్లు విధిగా ధరింపచేయాలని ప్రమాదాలకు గురికాకుండా బోట్లను జాగ్రత్తగా నడపాలని సిబ్బందికి సూచించారు. గోదావరి వరద రెండో ప్రమాద హెచ్చరికను దాటి మూడో ప్రమాద హెచ్చరిక దిశగా గోదావరి పెరుగుతుందని, లోతట్టు గ్రామాల్లోని ప్రజలందర్నీ సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సిబ్బందికి సూచించారు.

● అధికారులు సమన్వయంతో పనిచేయాలి

పోలవరం, జూలై 22: వరద సహాయక చర్యల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల వరదల ప్రత్యేకాధికారి ఎం.రాజు సూచించారు. పోలవరం గ్రామ సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు, పారిశుధ్యం, ఏటిగట్లు పరిరక్షణ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీడీవో జి.శ్రీను, తహసీల్దారు జీవీ.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గంగరాజు, డీటీ ప్రసాద్, గ్రామ కార్యదర్శి వై.కొండలరావు వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షార్థులకు పుస్తకాల పంపిణీ



డీఎస్సీ అభ్యర్థులకు పుస్తకాల పంపిణీ

టి.నరసాపురం, జూలై 22: డీఎస్సీ అభ్యర్థులకు పుస్తకాలు అందజేసినట్లు బంజారా భజరంగీ బేరీ జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ తెలిపారు. టి.నరసాపురం కృష్ణాపురంలో 30 మంది అభ్యర్థులకు 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. కష్టపడి చదివి ఉపాధ్యాయ వృత్తిని సాధించాలని అభ్యర్థులకు సూచించారు. బూక్యా వేణుగోపాల్, జరభల కృష్ణప్రసాద్, బూక్యా బిగనాథం, బూక్యా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రాల్లో సేవలు కొనసాగించాలి

జంగారెడ్డిగూడెం, జూలై 22: మీ సేవ కేంద్రాల్లో ప్రభుత్వ వెబ్ సైట్ పునరుద్ధరించి ఆన్‌లైన్ సేవలను కొనసాగించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు మరే పనులు జరగడం లేదన్నారు. తక్షణమే మీసేవ కేంద్రాల్లో సేవలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

కోళ్ల వ్యర్థాల రవాణా వాహనాలు పట్టివేత

పెదపాడు, జూలై 22 : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్లవ్యర్థాలను తరలిస్తుండగా రెండు వాహనాలను పట్టుకున్నట్లుగా ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. కోళ్లవ్యర్థాల రవాణాను అడ్డుకునేందుకు పెదపాడు, పరిసరాల్లో తనిఖీ నిర్వహిస్తున్నామని, తనిఖీల్లో పట్టుబడిన వాహనాలకు సంబంధించిన యజమాని, డ్రైవర్‌తో పాటు చెరువు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై చెప్పారు.

నేటి నుంచి ఆధార్ అప్‌డేట్ శిబిరాలు

భీమడోలు, జూలై 22: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి 27 వరకు ఆధార్ అప్‌డేట్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో స్వర్ణలత సోమవారం తెలిపారు. 23న ఆగడాలలంక, చెట్టున్నపాడు, 24 గుండుగొలను, పూళ్ళ, 25న కోరుకొల్లు, దుద్దేపూడి, 26న భీమడోలు, అంబర్‌పేట, కురేళ్ళగూడెం, 27 పోలసానపల్లి, సూరప్పగూడెం సచివాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

● ఉంగుటూరు: మండలంలో 23న ఉంగుటూరు, 24న బాదంపూడి, 25న నారాయణపురం, 26న కైకరం, 27న గొల్లగూడెం సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ శిబిరాలు నిర్వహిస్తారు. ఆధార్ నమోదు, అప్‌డేట్ బయోమెట్రిక్ నిర్వహిస్తారన్నారు.

● పోలవరం: మండల కేంద్రంలో సచివాలయం 1, 2, 3 పరిధిలో ఆధార్ అప్డేట్ కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు కార్యదర్శి వై కొండలరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ శిబిరం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

డ్రైవర్లకు పదోన్నతి వేతనాలు ఇవ్వాలి



ధర్నా నిర్వహిస్తున్న డ్రైవర్లు

ఏలూరు టూటౌన్, జూలై 22: నగరపాలక సంస్థలో నాలుగు నెలల క్రితం డ్రైవర్లుగా పదోన్నతి పొందిన వారికి పదోన్నతి వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించి అదనపు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్లకు పదోన్నతి ఇంక్రిమెంట్లు తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్రాంతి బోనస్ ప్రకటించి ఇంతవరకు ఇవ్వలేదని యూనియన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు ఆరోపించారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, ఎస్ఎం. సుబ్బారావు, ఎం.గోవింద్, దుర్గారావు, జి.అప్పారావు, అంతర్వేది శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ఏలూరు అర్బన్, జూలై 22: వ్యాధుల నివారణకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. వెంకన్న చెరువు, దక్షిణపువీధిలో దోమల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. జేపీ కాలనీ అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి నీలిమ దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులు వివరించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్య సిబ్బంది హైమావతి, శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్టీ ధ్రువీకరణ పత్రాల కోసం ఎంపీకి వినతి

కామవరపుకోట, జూలై 22: కొండగూడెం గ్రామానికి చెందిన నాయకుల తెగకు చెందిన తమకు అధికారులు ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ కలెక్టర్ దృష్టికి తీసుకువెళతా నన్నారు. మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, పండు జగదీష్, గోధుం మధు కలెక్టర్‌కు ఆ వినతిపత్రాన్ని అందజేశారు.

కరాటేలో భువనపల్లి విద్యార్థులకు పతకాలు

నిడమర్రు, జూలై 22: అంతర్జాతీయ కరాటే పోటీలలో భువనపల్లి బాలలు 16 పతకాలు సాధించారని కోచ్ యు.కళ్యాణ్ సుందరం తెలిపారు. చెన్నైలో జరిగిన పోటీల వివరాలను సోమవారం ఆయన తెలిపారు. బి.చరణ్, కె.దత్తాత్రేయ, టి.పృథ్వి, వి.పవన్ కనక తేజ, బి.చైతన్యతేజ, బి.పవన్ తేజ, కె.కావ్యశ్రీలక్ష్మి, కె.తేజశ్రీలక్ష్మి వివిధ విభాగాల్లో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారని ఆయన తెలిపారు.

శాకంబరిగా భ్రమరాంబిక



ద్వారకాతిరుమల, జూలై 22: క్షేత్ర పాలకుడైన భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయంలో అమ్మవారు సోమవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా ఆలయ ప్రాంగణములో ఉన్న భ్రమరాంబిక అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అమ్మవారిని పలువురు భక్తులు దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రాట్నాలమ్మ ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న భక్తులు

పెదవేగి, జూలై 22: కోనసీమ జిల్లా గుమ్మిలేరు గ్రామానికి చెందిన ముత్యాల వీరభాస్కరరావు, కృష్ణవేణి దంపతులు రాట్నాలమ్మ ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందించారు. సోమవారం ఉదయం అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ద్వారా ఆలయ ఈవో ఎస్.సతీష్‌కుమార్‌కు నగదు అందించారు. రాయల ఉమామహేశ్వరరావు, టీడీపీ నాయకులు మంచినేని శ్రీనివాసరావు, అవిర్నేని శ్రీధర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు



మర్లగూడెం వద్ద రోడ్డుపై పడిన చెట్టు

బుట్టాయగూడెం, జూలై 21: బుట్టాయగూడెం - జంగారెడ్డిగూడెం రహదారిలోని మర్లగూడెం వద్ద చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెట్టు పడిపోయింది. ఆర్ అండ్ బి అధికారులు స్పందించకపోవడంపై ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. టేకు చెట్టు కావడంతో తాము తొలగిస్తే కేసులు ఉంటాయోమోనని జనం భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంక్.. కూల్చివేత



వాటర్‌హెడ్ ట్యాంక్ కూల్చివేత పనులు

ఏలూరు రూరల్, జూలై 22: జాలిపూడిలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకును సోమవారం కూల్చివేశారు. గ్రామంలో 35 ఏళ్లక్రితం ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించారు. 40 వేల లీటర్ల వాటర్ సామర్థ్యం ఉన్న ట్యాంకు శిథిలావస్థకు చేరింది. వర్షాలకు అకస్మాత్తుగా కూలితే ప్రమాదమని స్థానికుల ఆందోళనతో ఉప సర్పంచ్ దాసరి బుజ్జి ట్యాంక్ కూల్చివేత పనులు చేపట్టారు. ప్రస్తుతం 60వేల లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్ ట్యాంకు ద్వారా గ్రామప్రజలకు నీరందిస్తున్నామని తెలిపారు.

చెత్త తొలగించారు : ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ద్వారకాతిరుమల, జూలై 22: పారిశుధ్యం అధ్వానం శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై పంచాయతీ సిబ్బంది స్పందించారు. అమ్మ అపార్ట్‌మెంట్ వద్ద చెత్త చెదారాన్ని తొలగించారు. సోమవారం ఉదయమే పంచాయితీ సిబ్బంది చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. కొన్ని నెలల చెత్తను తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ద్వారకాతిరుమలలో సైతం శుభ్రపరచాలని కోరుతున్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న జగన్

జంగారెడ్డిగూడెం, జూలై 22: ప్రజలను మభ్యపెట్టే విధంగా వైసీపీ నేత జగన్ మాట్లాడుతున్నారని టీడీపీ నేత మండవ లక్ష్మణరావు అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదేళ్లుగా ఇసుక, మద్యం, అక్రమ మైనింగ్, భూదోపిడీతో రాష్ట్రంలో శాంతి భద్రతలు లేకుండా చేశారన్నారు. జగన్ మతి స్థిమితం లేక టీడీపీ పాలనలో శాంతి భద్రతలు అదుపు తప్పాయని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు అర్బన్ :** కలకుర్రులో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన పొట్నూరి రామారావు కుటుంబానికి రూ.10వేలు సాయం అందజేసినట్టు శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూపు ప్రతినిధులు మోహన్, ప్రకాష్, శ్రీనివాసరావు తెలిపారు. సర్పంచ్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** నగరంలో శివాలయాల్లో భక్తులు అభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. శివనగర్ మల్లికార్జునస్వామి, పత్తేబాదలోని చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి, పవరుపేట కాశీ విశ్వేశ్వరస్వామి, అగ్రహారం ప్రతాప కాశీ విశ్వేశ్వరస్వామి, నగరేశ్వరస్వామి, ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.
- ఏలూరు అశోక్‌నగర్ జగన్నాథ మందిరం నుంచి ఈనెల 27న రథయాత్ర మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ట్రస్టు సభ్యులు తెలియజేశారు.
- **కామవరపుకోట :** ఆడమిల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు యలమర్తి రాజు సంతాప సభ సోమవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, కిలారు సత్యనారాయణ, తదితరులు రాజు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.
- ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తడికలపూడి ఎస్ఐ జయబాబు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో వాహనాలు తనిఖీ చేసి ఈ మేరకు వాహనదారులకు సూచనలు ఇచ్చారు. హెల్మెట్ ప్రాణాన్ని రక్షిస్తుందని చెప్పారు.
- **పోలవరం :** రైతులు సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌బీఐ మేనేజర్ రవి కుమార్ సూచించారు. రైతు సేవా కేంద్రంలో ఏవో కె రాంబాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రూ. లక్ష వరకూ రుణాలకు ఏడాది లోపు తిరిగి చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తిస్తుందని తెలిపారు. గేదెలపై రుణాలు మంజూరు చేసి దాణా అవసరాలకు రూ.5 వేల రుణం వస్తుందన్నారు. రైతు బిడ్డలకు విద్యా రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. గునపర్తి చిన్ని, కొణతాల ప్రసాద్, నునకాని రాంబాబు రైతులు పాల్గొన్నారు.



ఏలూరులో తమ్మిలేరు బ్రిడ్జి వద్ద తూడు తొలగింపు



ఉంగుటూరు మండలం కైకరం వంతెన వద్ద ఎక్స్‌కవేటర్‌తో తూడు తొలగింపు

తమ్మిలేరు, పంట కాల్వల్లో తూడు తొలగింపు

ఏలూరు రూరల్, జూలై 22: మండలంలో తమ్మిలేరు, పంట కాల్వలు, డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క విపరీతంగా పేరుకుపోయింది. గుర్రపుడెక్క దట్టంగా వ్యాపించి వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. వర్షం ఇలాగే కురిస్తే పంట పొలాలు మునిగిపోయే పరిస్థితి ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తుండటంతో వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. పంట కాలువల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగింపు కార్యక్రమం సోమవారం చేపట్టారు. పోణంగి, వైఎస్సార్‌కాలనీలో వరి చేలలో ముంపు నీరు లాగా డ్రెయిన్లలో గుర్రపుడెక్కను తొలగించారు. తమ్మిలేరులో వరదనీటి ప్రవాహానికి గుర్రపుడెక్క అడ్డుగా ఉండటంతో వ్యవసాయశాఖ అధికారులు స్వయంగా దగ్గరుండి తొలగింపు పనులు చేపట్టారు. వేసవిలో మరమ్మతులు చేయాల్సిన అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో తూడు, గుర్రపుడెక్క, కలుపు జాతి మొక్కలు పేరుకుపోయాయి. వేసవిలో ఉపాధి పనులు లేదా, రసాయన పిచికారీ పద్ధతుల్లో చెత్తాచెదారాన్ని తొలగించే చర్యలు చేయక అధికారులు మిన్నకుండిపోవడంతో నేడు ఈ దుస్థితి నెలకొందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కైకరం వంతెన వద్ద తూడు తొలగింపు

ఉంగుటూరు: ఏలూరు కాల్వ వదలినప్పటి నుంచి కైకరం వంతెన వద్ద దుంగలు అడ్డుపడడం, గుర్రపు డెక్కతో ప్రవాహం నిలిచిపోయింది. సాగు నీటికి తీవ్ర ఇబ్బంది ఎదురైంది. ముంపు పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే ధర్మరాజు దృష్టికి స్థానికులు తీసుకువెళ్లడంతో సోమవారం ఉదయం ఇరిగేషన్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తూడును తొలగించారు. దీంతో రైతులు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



పతకాలు సాధించిన అంధ విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పారా అథ్లెటిక్స్‌లో హీల్ విద్యార్థుల ప్రతిభ

ఆగిరిపల్లి, జూలై 22: జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో హీల్ అంధ పాఠశాల విద్యార్థులు రజత, కాంస్య పతకాలు అందుకున్నారు. బెంగుళూరులో ఇటీవల జరిగిన 13వ జాతీయ జూనియర్ సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ పోటీల్లో హీల్ పారడైజ్ అంధ పాఠశాల విద్యార్థిని జాలా వరలక్ష్మి లాంగ్ జంప్‌లో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం పొంది రజత పతకం సాధించగా 1500 మీటర్ల పరుగు పందెంలో కె.సునీల్ తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం, సీహెచ్ ప్రవీణ్ 5వ స్థానంలో నిలిచాడని హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం జరిగిన విజేతల అభినందన కార్యక్రమంలో హీల్ ఇండియా అధ్యక్షుడు, ఏపీ మాజీ డీజీపీ రామావతార్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, ప్రిన్సిపల్ బి.సాయిబాబు, అంధ పాఠశాల చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సుఖవాసి, రుష్మంత్, పీడీలు ఎస్.నాగరాజు, ప్రభుదాస్, అథ్లెటిక్స్ కోచ్ ఏ.శ్రీనివాసరెడ్డి, ట్రైనర్ కె.నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిండిన తాగునీటి చెరువు



కలిదిండి, జూలై 22 : పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువును సర్పంచ్ మోకా లక్ష్మీ రామకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు, గ్రామ పెద్దలు సహకారంతో పూర్తిస్థాయిలో నింపారు. కోరుకొల్లు లాకుల వద్ద ఈ నెల 15న కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సీబీ కెనాల్‌కు తాగునీటిని విడుదల చేయడంతో పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువుకు నీటి వంతు ఇచ్చారు. గ్రామస్థులు స్వచ్ఛందంగా రేయింబవళ్లు కాల్వ వెంబడి మూడు రోజుల పాటు కాపలా కాస్తూ యుద్ధప్రాతిపదికన ఐదు మోటార్ పంపులతో తాగునీటి చెరువును పూర్తిస్థాయిలో నింపారు. కుళాయిల ద్వారా సురక్షిత తాగునీటిని సరఫరా చేయటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డ్రెయినేజీల పూడికతీత

కలిదిండి, జూలై 22 : కలిదిండిలో డ్రెయినేజీ పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కలిదిండి సెంటర్ నుంచి లాల్వ డ్రెయిన్ వరకు ప్రధాన రహదారి వెంబడి ఆక్రమణలు తొలగించి పూడికను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్నారు. డ్రెయినేజీలు పూడుకుపోవటంతో కొద్దిపాటి వర్షానికే రహదారులు జలమయమవుతున్నాయి. ప్రస్తుతం పూడికతీత పనులు జరుగుతుండటంతో రహదారులపై నీరును తొలగిస్తున్నారు.



కౌలు రైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ

మండవల్లి జూలై 22 : పెరికేగూడెం రైతు సేవా కేంద్రంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులను మండవల్లి వ్యవసాయ శాఖ ఏడీఏ జి. వెంకటమణి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులు గ్రూపులుగా ఏర్పడి పంట రుణాలు పొందవచ్చని, ఈ క్రాప్ ద్వారా తాము పండించిన పంటను అమ్ముకోవచ్చని, ఎరువులు, విత్తనాలపై సబ్సిడీతో పాటు ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోతే పరిహారం పొందేందుకు ఈ కార్డులు దోహదపడతాయని వివరించారు. మండవల్లి మండలం వ్యవసాయాధికారిణి షేక్ జరినా, వీఏఏ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కపల్లిలో భూ ఆక్రమణపై చర్యలేవీ?



ముసునూరు, జూలై 22: మండలంలోని చెక్కపల్లి సగర కాలనీ సమీపంలో ప్రధాన రహదారి పక్కన రెవెన్యూ పోరంబోకు భూమి ఆక్రమణకు గురవుతున్నా పంచాయతీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ భూమిలో కొంత స్థలం మెరక చేసి సగరులంతా భగీరథుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆక్రమణదారుడు విగ్రహం పక్కనే పెంటకుప్ప వేస్తుండటంతో సగరుల ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో తొలిగించి, ఈ భూమిని మరల ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా ఆక్రమణదారుడు రాత్రి సమయంలో భగీరథ విగ్రహం పక్కనే రేకుల షెడ్ వేసి, మరోవైపు పెంటకుప్ప వేశాడు. దీంతో సుమారు 50 మంది సగరులు ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు గత సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'లో అర్జీ ఇచ్చారు. అయినా చర్యలు లేకపోవడంతో రెవెన్యూ శాఖకు చెందిన భూమి ఆక్రమణకు గురైనా తహసీల్దార్, వీఆర్వోలు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆక్రమణలను తొలగించేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సగర సంఘం, స్థానికులు కోరుతున్నారు.

చెరువు ఆక్రమణదారులకు నోటీసులు

ముసునూరు, జూలై 22: రమణక్కపేట పంచాయతీ పరిధిలోని కోమటికుంట చెరువు ఆక్రమణ దారులకు పంచాయతీ అధికారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈ చెరువు భూమిని ఆక్రమించుకుని ఇళ్ళు, దుకాణాలను నిర్మించుకున్న సుమారు 15 మందికి మహిళా పోలీస్ వీరకుమారి అందజేశారు. ఆక్రమణదారులు నిర్ణీత సమయంలో ఖాళీ చేయాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని కార్యదర్శి ప్రసాద్ హెచ్చరించారు.

దమ్ము ట్రాక్టర్లతో రహదారులు ధ్వంసం



చాట్రాయి, జూలై 22: దమ్ము ట్రాక్టర్లు రహదారులపై యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వీటి నియంత్రణపై అధికారులు పట్టించుకోకపోవటంతో రహదారులు గుల్లవుతున్నాయి. ఐదేళ్లుగా మరమ్మతులు లేక శిథిలమైన రహదారులు ఇప్పుడు దమ్ము ట్రాక్టర్ల తాకిడికి మరింత అధ్వానంగా మారుతున్నాయి. రహదారిపై గోతులు రోజురోజుకు పెద్దవై భారీ వర్షాలకు తటాకాలుగా మారుతున్నాయి. దమ్ము ట్రాక్టర్లు తిరగటం వల్ల రహదారులు బురదకయ్యగా మారిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి దమ్ము ట్రాక్టర్లను నియంత్రించి రహదారులు దెబ్బ తినకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

క్రైం సమాచారం

చెల్లని చెక్కు ఇచ్చినందుకు జైలు, జరిమానా

నూజివీడు, జూలై 22: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. రామన్నగూడెంకు చెందిన శీలం వెంకటేశ్వరరావు 2020 ఫిబ్రవరిలో విజయవాడకు చెందిన కరికేటి పాల్ తిమోతికి రూ.7 లక్షలు అప్పుగా ఇవ్వగా బాకీ తీర్చే నిమిత్తం రూ.7.5 లక్షలకు 2021 మార్చిలో చెక్కులు ఇచ్చాడు. అయితే ఆ చెక్కులు బౌన్స్ కావడంతో బాధితుడు కోర్టును ఆశ్రయించగా నిందితుడు తిమోతికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు.



నూజివీడులో జోరుగా గంజాయి విక్రయాలు

- మత్తులో దారి తప్పుతున్న యువత
- దొంగతనాలకు తెగబడుతున్న వైనం
- ఫిర్యాదులు పట్టించుకోని పోలీసులు

నూజివీడు పట్టణంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ యువతకు గంజాయి స్వేచ్ఛగా దొరుకుతుండడంతో ఈ వ్యసనానికి మరింత బానిసలవుతున్నారు. తాజాగా పట్టణంలోని బాపూనగర్‌లో కొందరు యువకులు, ఒక యువకుడిని ఫలానా వ్యక్తి నుంచి గంజాయి తీసుకురమ్మని కోరటం, దానికి ఆ యువకుడు తిరస్కరించడంతో ఆ యువకుడిపై వారు దాడి చేసి బ్లేడుతో గాయపరిచిన సంఘటన ఇటీవల జరిగిన సంగతి తెలిసిందే. పదిహేనేళ్ల నుంచి నూజివీడులో గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం ఎక్కువగానే ఉన్నా, మీడియాలో ఈ విషయం వెల్లడైనప్పుడు పోలీసులు అరికట్టడానికి కనీసం కంటితుడుపు చర్యలు చేపట్టేవారు. గత వైసీపీ పాలనలో పోలీసులు గంజాయిని అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. గంజాయిపై సమాచారమిచ్చినా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

\- నూజివీడు

నూజివీడు పట్టణం నలుమూలల్లోనూ, శివారు ప్రాంతాల్లోని మామిడితోటలు, జనసంచారం లేని ప్రాంతాల్లో ప్రతి రోజూ సాయంత్రం యువత గంజాయి సేవిస్తున్నారు. గతంలో గంజాయి అమ్మకాలను 40, 50 ఏళ్ల పైబడిన వ్యక్తులు చేసేవారు. ఇప్పుడు గంజాయి అమ్మకందారులు, కొనుగోలుదారులు యువకులే కావడం విశేషం. పట్టణంలో బాపూనగర్, నెహ్రూపేట, అమెరికన్ ఆసుపత్రి సెంటర్, ఎమ్మార్ అప్పారావు కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, ఆర్‌ఆర్ పేట, గాంధీనగర్ ప్రాంతాల్లో గంజాయి వినియోగం ఎక్కువగా ఉందని సమాచారం. ఇప్పటివరకు గంజాయి అమ్మకాల్లో వైసీపీకి చెందిన స్థానిక యువ నాయకులు పాత్ర ఉందనే ప్రచారం సర్వత్రా వినిపిస్తోంది. ముఖ్యంగా మధ్యతరగతి, దిగువ తరగతి యువత ఈ వ్యసనానికి బానిసలై చివరకు గంజాయి కొనుగోలుకు దొంగతనాలకు దిగుతున్నారు. బాపూనగర్‌లో చాలామంది తమ ఇంటి బయట పెట్టిన ద్విచక్రవాహనాల్లో రాత్రివేళ పెట్రోల్ దొంగతనాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇది గంజాయి తాగేందుకు అలవాటు పడినవారి పనే అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



నూజివీడులో పట్టుబడిన గంజాయి, మత్తు ఇంజక్షన్లు (ఫైల్)

యువత బానిస

గత ఐదేళ్లుగా నూజివీడులో గంజాయికి అధిక సంఖ్యలో యువత బానిసలయ్యారు. దీనికి ప్రధాన కారణం మార్కెట్లో యథేచ్ఛగా గంజాయి దొరకడమే. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కొంతమంది యువకులు నూజివీడులో మకాం వేసి, ఊరు శివారులో సిగిరెట్ తాగే యువతను టార్గెట్ చేసి వారితో పరిచయం పెంచుకుని వారికి తొలుత కొద్ది మొత్తంలో గంజాయిని ఉచితంగా ఇచ్చి వారిని మత్తుకు అలవాటు చేశారు. ఈ మత్తుకు అలవాటు పడిన యువకుల నుంచి తరువాత డబ్బులు వసూలు చేసేవారు. ఇంజినీరింగ్ విద్యను సైతం అభ్యసిస్తున్న కొంతమంది బానిసలై చివరకు గంజాయి కొనటానికి సొమ్ము లేక వారు గంజాయి అమ్మకాలకు దిగినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వారు రెండుసార్లు పట్టుబడి జైలుకు వెళ్లి తమ విద్యను పాడుచేసుకున్న ఘటనలు నూజివీడులో జరిగాయి.

నిద్ర మత్తులో పోలీసులు

గంజాయి అమ్మకాలపై పోలీసుల వద్ద పూర్తిసమాచారం ఉన్నప్పటికీ పోలీసులు నిద్రమత్తులో జోగుతున్నారనే ప్రచారం ఉంది. మైనర్ల భవిష్యత్తు దృష్ట్యా వారిమీద కేసులు నమోదు చేయకున్నా, వారి ద్వారా అమ్మకం దారులను పట్టుకుని కేసులు నమోదుచేసి అమ్మకాలను అరికట్టవచ్చు. కానీ పోలీసులు ఆ పని చేయడం లేదు. నూజివీడుకు చెందిన యువ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఆ వైద్యుడు స్పందనలో ఫిర్యాదు చేసినా న్యాయం జరగకపోవడంతో ఇటీవల సదరు వైద్యుడు సామాజిక బాధ్యత దృష్ట్యా కోర్టులో ప్రైవేట్ కేసు వేయడంతో కోర్టు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేయమని పోలీసులను ఆదేశించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కేసు నమోదైనా చర్యలు నిల్



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గంజాయి తేనందుకు దాడికి గురైన యువకుడు(ఫైల్)

కోర్టు జోక్యంతో పోలీసులు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినా ఇంతవరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇది దేనికి సంకేతమో పోలీసులే చెప్పాలని నూజివీడు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వైసీపీ ప్రభుత్వం మారి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇటీవల ఏలూరు జిల్లాకు నూతన ఎస్పీగా కొమ్మి ప్రతాప్ శివకిశోర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ప్రాధాన్యత దృష్ట్యా గంజాయిని అరికట్టడంపె దృష్టి సారించి ఉక్కుపాదం మోపి యువత భవిష్యత్తును కాపాడేలా నూజివీడు పోలీసులు నిద్రమత్తు వదిలేస్తారని ఈ ప్రాంత ప్రజలు ఆశాభావంతో ఉన్నారు.

నిండుకుండలా తమ్మిలేరు

చాట్రాయి, జూలై 22: భారీ వర్షాలకు తమ్మిలేరు ప్రాజెక్టు నిండుకుండలా మారింది. సోమవారం ప్రాజెక్టు నీటితో నిండి జలకళను సంతరించుకోవటంతో రైతులు, ప్రజలు తరలివచ్చి తిలకిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కింద ఏలూరు జిల్లాలో 25 వేల ఎకరాలు ఆయకట్టు ఉండగా, ఖరీఫ్, రబీ పంటకు సాగునీరు సమృద్ధిగా సరిపోతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తమ్మిలేరు ప్రాజెక్టును తిలకిస్తున్న రైతులు తదితరులు

ముంపు నుంచి తేరుకోని పొలాలు

ముదినేపల్లి, జూలై 22 : భారీ వర్షాలకు మండలంలో ముంపునకు గురైన వెదజల్లిన సార్వా వరి పొలాలు నేటికీ తేరుకోలేదు. రెండు రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టినా మేజర్, మీడియం డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తూనే ఉన్నాయి. మైనర్ డ్రెయిన్లలో నీటి ప్రవాహం స్తంభించిపోవటంతో పొలాల నుంచి ముంపు నీరు తగ్గటం లేదు. డ్రెయిన్ల శివారు భూముల్లో వారం రోజులుగా ముంపు తగ్గలేదు. ఊటుకూరు మీడియం డ్రెయిన్ కింది భాగంలో నాలుగు కిలోమీటర్లు పేరుకుపోయిన కిక్కిస వల్ల నీటి ప్రవాహం పూర్తిగా స్తంభించిపోయింది. దీంతో సుమారు 250 ఎకరాల ఆయకట్టులో వెదజల్లిన వరి పైరు కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. కిక్కిస తొలగించే వరకు ఈ డ్రైన్ కింద వరి సాగు జరిగే అవకాశాలు కనిపించటం లేదు. చినపాలపర్రు ఏరియాలోని భూముల నుంచి కూడా ముంపు తగ్గటం లేదు. త్వరితగతిన కిక్కిస, గుర్రపు డెక్క తొలగించకుంటే ముంపు తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెదలంక మేజర్ డ్రెయిన్ పొంగి ప్రవహిస్తుండటంతో అన్నవరం మీడియం డ్రెయిన్లో నీటి ప్రవాహం స్తంభించిపోయింది.

వెదజల్లిన వరి పొలాల పరిశీలన..

మండలంలో ముంపునకు గురైన వెదజల్లిన సార్వా వరి పొలాలను సోమవారం బొమ్మినంపాడు, అల్లూరు, కొరగుంటపాలెం గ్రామాల్లో ఏడీఏ జి.వెంకట మణి, ఏవో బి.వేణుమాధవ్ పరిశీలించారు. నారుమడిలో చల్లిన విత్తనాలు మూడు రోజుల కంటే ఎక్కువ కాలం నీట మునిగి ఉంటే మొలక శాతం తగ్గుతుందని, వీలైనంత త్వరగా నీరు బయటకు పోయేలా చూడాలని రైతులకు తెలిపారు. విత్తనాలు చల్లిన 7 నుంచి 30 రోజుల మధ్య ఉన్న నారు ఐదు రోజుల కంటే ఎక్కువగా నీట మునిగి ఉంటే నీటిని పూర్తిగా బయటకు పంపి 5 సెంట్ల నారుమడికి కేజీ యూరియా, కేజీ పొటాష్ చల్లాలని, ఒక గ్రాము కార్బండిజమ్ పిచికారీ చేయాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



లిఖితకు తొలి అడ్మిషన్ కార్డును అందిస్తున్న చంద్రశేఖర్

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు ప్రారంభం

నూజివీడు టౌన్, జూలై 22: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జనరల్ కౌన్సెలింగ్ ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. తొలి రోజు 515 మందికి కాల్ లెటర్లు పంపగా 436 మంది ప్రవేశాలను పొందారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా రెండు రిజిస్ట్రేషన్ కౌంటర్లు, నాలుగు అకడమిక్ వెరిఫికేషన్ కౌంటర్లు, మూడు ఫీజు కౌంటర్లు, డేటా ఎంట్రీకి సంబంధించి ఏడు కౌంటర్లు, సర్టిఫికెట్ కలెక్షన్‌కు నాలుగు, ఐడీ కార్డు ఇష్యూ కౌంటర్లు మూడు ఏర్పాటు చేశారు. శాక్ బిల్డింగ్‌లో అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు చేయగా నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్, అడ్మిషన్స్ కన్వీనర్ అమరేంద్ర కుమార్‌లు తొలిరోజు ప్రవేశాల ప్రక్రియను పర్యవేక్షించారు. పదో తరగతిలో 597 మార్కులు సాధించి ఆర్జీయుకేటీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న తిరుపతి జిల్లా కొత్త వేపకుప్పంకు చెందిన పి.లిఖితకు తొలి అడ్మిషన్ ఇస్తూ డైరెక్టర్ చంద్రశేఖర్, అమరేంద్ర కుమార్‌లు ఐడీ కార్డును అందించారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

ముదినేపల్లి, జూలై 22: పంచాయతీల గ్రేడ్-3 కార్యదర్శులకు గ్రేడ్-2 కార్యదర్శులుగా పదోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కె.కన్నబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముదినేపల్లి మండలంలో నలుగురు గ్రేడ్-3 పంచాయతీల కార్యదర్శులకు గ్రేడ్-2 కార్యదర్శులుగా ప్రమోషన్లు లభించాయి. వడాలి పంచాయతీ కార్యదర్శి జి.రమేష్, పెయ్యేరు కార్యదర్శి శ్యామ్ సుందర్, పెదపాలపర్రు కార్యదర్శి షెహనాజ్, చేవూరు కార్యదర్శి నాగలక్ష్మికి ప్రమోషన్లు కల్పిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. వడాలి, పెయ్యేరు, చేవూరు కార్యదర్శులను కృష్ణా జిల్లాకు కేటాయించారు.

వైష్ణవికి చలసాని అభినందన



ముదినేపల్లి, జూలై 22 : అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవిని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు అభినందించారు. ముదినేపల్లిలోని ఆమె నివాసంలో సోమవారం వైష్ణవిని కలసి రాజధాని నిర్మాణానికి పొలం అమ్మి విరాళం ఇవ్వటం అభినందనీయమన్నారు. చిన్న వయస్సులో రాష్ట్రాభివృద్ధి పట్ల వైష్ణవి ఆసక్తి చూపించటం ఆమె ఉదారతకు నిదర్శనమన్నారు.

మృతుల కుటుంబాలకు చేయూత



కైకలూరు జూలై 22: ఈ నెల 12న రోడ్డు ప్రమాదంలో మరణించిన ఇద్దరు యువకుల కుటుంబాలకు ఎమ్మెల్యే కామినేని, గ్రామస్థులు రూ.1,62,000ల ఆర్థిక సాయం అందజేశారు. మృతి చెందిన యువకులు బోడావుల దుర్గాప్రసాద్, సాయిల దుర్గాప్రసాద్‌ల కుటుంబాలకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు చొప్పున, గ్రామస్థులు ఒక్కో కుటుంబానికి రూ.71వేలు చొప్పున సోమవారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే కామినేని ఆర్థిక సాయం అందించడాన్ని స్ఫూర్తిగా తీసుకుని గ్రామస్థులు రూ.1,42,000లను విరాళాలు సేకరించి మృతుల తల్లిదండ్రులకు చెక్కు రూపేణా అందజేశారు. గ్రామస్థులు బోయిన గోవర్ధన, తలారి శ్రీహరి, అడవి ప్రసాద్ ఆధ్వర్యంలో చెక్కులను అందజేశారు.

గోశాలకు ఆర్థిక సాయం



ఆగిరిపల్లి, జూలై 22: ఆగిరిపల్లి శోభనాచల లక్ష్మీనరసింహ వేద పాఠశాలలోని గోశాలకు గ్రాసం నిమిత్తం సోమవారం విజయవాడ సత్యనారా యణపురం వాస్తవ్యులు జూలూరు స్వరాజ్‌కిషోర్, గుప్త పదివేల రూపాయలు వితరణ చేశారు. పాఠశాల కార్యదర్శి సూరిశర్మ వీరిని అభినందించారు.

పైపులైన్ మరమ్మతులు తక్షణమే చేపట్టాలి



మండవల్లి జూలై 22 : మండవల్లిలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పలు చోట్ల ధ్వంసమైన తాగునీటి పైపులైన్లకు తక్షణమే మరమ్మతులు చేప ట్టాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఏలూరు జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండవల్లి మండల శాఖ అధ్యక్షుడు టి. అప్పారావులు సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సుబానికి ఫిర్యాదు చేశారు. లీకుల వల్ల మురుగునీరు పైపులలోనికి చేరి తాగునీరు కలుషితమవుతోందన్నారు. ఎక్కడో ఒకచోట పైపులు పగిలి వాటి రిపేర్లకు ఒక్కోసారి రోజుల తరబడి మంచినీరు సరఫరా కావడం లేదు. డ్రైనేజీ పూర్తికాక గృహస్థులు, వ్యాపారులు వర్షాలకు తీవ్ర ఇబ్బంది లను ఎదుర్కొంటున్నారని, పనులు ప్రారంభించి రెండేళ్లయిందని, కేవలం 2 కిలోమీటర్లు డ్రైనేజీని, రోడ్డును అభివృద్ధి చేయకపోవడం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమేనని ఆరోపించారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలిలా..

చాట్రాయి, జూలై 22: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో 23 నుంచి 27 వరకు గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నామని ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో మంగాకుమారి కోరారు. 23న చాట్రాయి, చనుబండ-1 సచివాలయాల్లో, 24న పోలవరం, చిన్నంపేట, 25న మర్లపాలెం, బూరుగ్గూడెం, 26న చిత్తపూరు, చీపురుగూడెం, 27న జనార్దనవరం, కోటపాడు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు జరుగుతాయని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక ఆధార్ క్యాంపులపై గ్రామాల్లో దండోరా వేసి ప్రచారం నిర్వహించి, గ్రామ సచివాలయాల వద్ద షామియానా, కుర్చీలు, తాగునీరు మొదలైన ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో ఆదేశించారు.

ముసునూరు: మండలంలో ఆధార్ శిబిరాల నిర్వహణపై ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. 23న వేల్పుచర్ల, 24న గోపవరం-2, 25న ముసునూరు-2, 26న అక్కిరెడ్డిగూడెం, 27న గుళ్ళపూడి గ్రామ సచివాలయాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరాలు జరుగుతాయని ఎంపీడీవో తెలిపారు. అలాగే శిబిరాలు జరిగే సచివాలయాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలను కల్పించామని, విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలని ఇప్పటికే ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇచ్చామన్నారు.

కలిదిండి: కలిదిండి, మూల్లంక గ్రామ సచివాలయాల్లో ఆధార్ శిబిరాలను ఈ నెల 23 నుంచి ఐదు రోజులపాటు నిర్వహిస్తామని ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. గ్రామాల్లో పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహించటానికి చర్యలు తీసుకోవాలన్నారు.

30న ముదినేపల్లి మండల పరిషత్ సమావేశం

ముదినేపల్లి, జూలై 22 : ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న జరగనుంది. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో ఎస్.మురళీ గంగాధరరావు తెలిపారు.

ఆవులకు ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలు



కైకలూరు జూలై 22 : ఆవుల్లో ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలను రైతులు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి. ముస్తాఫా ఖాన్ అన్నారు. సోమవారం కైకలూరులో రహదారిపై సంచరిస్తున్న ఆవులకు ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైకలూరు మండలానికి 1000 డోసులు, కలిదిండి మండలానికి 1400 డోసుల టీకాలు అందుబాటులో ఉన్నాయని రోడ్లపై తిరిగే ఆవులకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో టీకాలు వేస్తున్నామన్నారు. అలాగే ఇళ్ళవద్ద పెంచుకునే ఆవులకు యజమానులు ఈ టీకాలు వేయించాలన్నారు. ఈ టీకాలను ఉచితంగా వేస్తారని, రైతులు పశువైద్యులను సంప్రదించాలని కోరారు. కైకలూరులో సంచరిస్తున్న 100 ఆవులకు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు.

రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి

చాట్రాయి, జూలై 22: రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బ తిన్న రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో పంటలకు నష్టం జరగటమే కాక రహదారులు ధ్వంసమయ్యాయని అన్నారు. ఇంత విస్తారంగా వర్షాలు కురిసినా నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం లేక 4 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదలం, పాలకుల నిర్లక్ష్యానికి ఫలితమని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల వల్ల పనులు లేక ఇబ్బందులు పడుతున్న వ్యవసాయ కూలీలకు ఉచిత రేషన్ ఇవ్వాలని కోరారు. పొలాల్లో ఇసుక మేటలు తొలగించుకోవటానికి తక్షణ సాయం ప్రకటించటంతో పాటు, విత్తనాలు, ఎరువులు ఉచితంగా పంపిణీ చేయాలని, గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని పంట నష్టాన్ని అంచనా వేసి ఎకరానికి రూ. 25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న కేవీవీ ప్రసాద్

మామిడికి గడ్డు రోజులు

నూజివీడు టౌన్, జూలై 22: ప్రపంచ స్థాయిలో పేరు గాంచిన నూజివీడు మామిడికి గడ్డు పరిస్థితి ఏర్పడిందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. మామిడి దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నూజివీడులో మామిడి రైతు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మామిడి ఉత్పత్తిలో ఏపీ రెండో స్థానంలో ఉందన్నారు. కొన్నేళ్లుగా మామిడి రైతాంగం నష్టాల పాలవుతోందన్నారు. ప్రతికూల వాతావరణంలో సాగు చేసి పంట అమ్ముకునేందుకు కిలో మీటర్ల మేర సరుకు తీసుకెళ్లాల్సి వస్తోందన్నారు. నష్టాల బారిన పడకుండా శాస్త్రవేత్తల ప్రయోగాలు రైతులకు చేరాలన్నారు. నూజివీడు రైతాంగం సంయుక్తంగా నాణ్యమైన పంటను అందించే లక్ష్యంతో ఉండాలన్నారు. సదస్సులో ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, జిల్లా కార్యదర్శి ఆర్. లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు ప్రభాకరరావు, కొమ్మన నాగేశ్వరరావు, చలసాని వెంకట రామారావు, డి.హరినాథ్ పాల్గొన్నారు.

ఎంపీ మహేష్‌ను కలసిన బీజేపీ నాయకులు



నూజివీడు, జూలై 22: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌ను నూజివీడు నియోజకవర్గ బీజేపీ నాయకు లు సోమవారం ఏలూరు క్యాంప్ కార్యాలయంలో కలిశారు. బీజేపీ నూజివీడు మండల అధ్యక్షుడు గోగినేని శ్రీనివాస కుమార్ అప్పారావు, వైఎస్ దొరై, చాట్రాది రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలసి గుడివాడ నుంచి భద్రాచలం నూతన రైల్వే లైన్ ఏర్పాటు, ఏలూరులో వందే భారత్ హాల్ట్‌కు కృషి చేయాలని కోరారు.

వ్యవస్థలపై గౌరవం లేని జగన్ : ముద్దరబోయిన

నూజివీడు, జూలై 22: వ్యవస్థలపై మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి గౌరవం లేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో హత్యా రాజకీయాలను తన స్వలాభం కోసం వినియోగించుకున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. తన బాబాయ్‌ను హత్య చేసిన హంతకులను పట్టుకొని శిక్షించలేకపోయాడని, సొంత చెల్లెళ్లకు న్యాయం చేయలేకపోయాడని ధ్వజమెత్తారు. ఐదేళ్ల జగన్ పాలనలో 40 మంది రాజకీయ దాడులకు బలయ్యారన్నారు. అంతేకాక 300 బీసీలు, 200 ఎస్సీలు, 59 ఎస్టీలు, 11 మంది మైనార్టీలు హత్యలకు గురయ్యారన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు హత్యల్లో భాగమైతే జగన్ ఎందుకు నోరు మెదపలేదన్నారు.

నర్సరీల్లో నాణ్యమైన నారు అందించాలి

నూజివీడు టౌన్, జూలై 22: నర్సరీ యాజమాన్యం తెగుళ్ళ, చీడపీడలను లేని నాణ్యమైన నారును రైతులకు అందించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎస్.రామ్మోహన్ సూచించారు. నూజివీడులోని నర్సరీలను ఆయన సోమవారం పరిశీలించి నారు పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు నారు తీసుకునేటప్పుడు రశీదు పొందాలన్నారు. నూజివీడు హెచ్.వో ఆర్.హేమ పాల్గొన్నారు.